తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice — వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

03-10-2026

శనివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 235

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి

People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575





## జీతం లేకుండానే ఉద్యోగం..

## అయినా విలాసవంతమైన

# జీవితం!

### వర్క్ ఆర్డర్లు పెండింగ్ పెట్టినా నో ప్రాబ్లమ్

- ఫోకల్ పోస్టుల్లో కాసుల వర్షం
- వందల సంఖ్యలో ఇంజనీరింగ్ అధికారులకు ఏళ్ల తరబడి అందని జీతాలు
- ఏఈగా పనిచేసినప్పుడు వర్క్ ఆర్డర్లు పూర్తి చేయకపో-వడంతో జీతాలు నిలిపిత
- పదవీ విరమణ సమయంలోనైనా తీసుకోవచ్చన్న ధీమా
- ఫోకల్ పోస్టుల్లో అడ్డగోలు ఆర్జనే కారణం
- నోటీసులు ఇచ్చినా డోంట్ కేర్..
- అధికారులపై శాఖాపరమైన చర్యలు శూన్యం
- తానే అధికారి.. తానే కాంట్రాక్టర్..
- నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి నాసిరకం పనులు
- జీడిమెట్ల డివిజన్లో ఒక ఏడీఈ బినామీ పేరుతో ఏకంగా 16 భారీ కాంట్రాక్టు పనులు పూర్తి

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్

టీజీఎస్పీడీసీఎల్ లో వింత పరిస్థితి రాజ్యమేలుతోంది. వందల సంఖ్యలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అధికారులకు నెలల తరబడి, ఏళ్ల తరబడి ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ జీతం అందడం లేదు. సాధారణ ఉద్యోగికి ఒక్క నెల జీతం మిగతా 2వ పేజీలో..

# ప్రజా రవాణాలో డిజిటల్ విప్లవం

- ఆర్టీసీ - మెట్రో ఉమ్మడి పాస్, మీ టికెట్ యాప్ ప్రారంభం
- 12 సంవత్సరాల తర్వాత ఆటో రిక్షా చార్జీలు సవరిస్తూ జీవో విడుదల
- ప్రారంభించిన డిప్యూటీ సీఎం, రవాణా మంత్రి పొన్నం
- బస్సులు, మెట్రో రైళ్లలో ప్రయాణించేలా కామన్ పాస్ విధానం

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 2 (సిరి న్యూస్):

తెలంగాణ ప్రజా రవాణా వ్యవస్థను సరికొత్తగా ఆధునీకరిస్తూ.. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది.

మిగతా 2వ పేజీలో..




## టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో

### గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి

- ప్రధాన కార్యాలయంలో నివాళులర్పించిన సీఎండీ జితేష్ వి. పాటిల్
- ప్రతి ఉద్యోగి ప్రజాసేవను ధర్మంగా భావించాలని హితువు

2





## ఇకపై అన్ని సబ్జెక్టులకు ప్రాక్టికల్స్?

- సిలబస్ తోపాటు మారిన మార్కుల విధానం

హైదరాబాద్,సిరి న్యూస్, అక్టోబర్ 2:

రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరం (202627) నుంచి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు కీలక మార్పులు తీసుకొచ్చింది. చదువుకునే సిలబస్ తోపాటు పరీక్షల విధానంలోనూ సమూల మార్పులు చేశారు. ఇప్పటివరకు కేవలం కొన్ని సబ్జెక్టులకే పరిమితమైన

మిగతా 2వ పేజీలో..

### విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను

## అడ్డుకోవాలి

- దశాబ్దాలుగా ప్రభుత్వాలు నిర్మించిన ప్రజల ఆస్తులివి
- కాంగ్రెస్ జాతీయ విధానం ఒకలా, తెలంగాణలో మరోలా ఏంటి?
- రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



2



2

## 'సర్' విచారణ మీ ఇంటి వద్దే..

- కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన ఈసీ
- ఓటుకు భద్రత కల్పించేలా నిర్ణయం

## సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సహకారం

- హరేకృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఒప్పందం
- సీఎం రేవంత్ చేతుల మీదుగా చెక్కుల అందజేత

3



## పింఛన్‌కు రూ.10 వేల లంచం?..



- పింఛన్ కోసం రూ.10 వేల డిమాండ్?..
- లంచం ఇవ్వకుంటే పింఛన్ ఆపేస్తానని హెచ్చరిక?..
- వార్డు అధికారిపై కమిషనర్‌కు ఫిర్యాదు..
- ఫిర్యాదుతో కార్పొరేషన్‌లో కలకలం

3

## బాపూ ఘాట్‌లో మహాత్ముడికి నివాళులు



2



2

## కళ్యాణలక్ష్మి కేసీఆర్ మానవీయ పాలనకు నిదర్శనం: కేటీఆర్

- 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు
- గిరిజన తండాలో చూసిన ఘటనతో కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం
- పేదింటి ఆడబిడ్డల పెళ్లికి రూ.1,00,116 ఆర్థిక సాయం



### ముఫ్త్ బిజ్లీ యోజనపై విస్తృత అవగాహనకు

## సేవా సేతు అభియాన్

- టిమ్స్ సనత్‌నగర్‌లో వినియోగదారుల అవగాహన శిబిరం ప్రారంభం
- విద్యుత్ బిల్లులు తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చు

3

# జీతం లేకుండానే ఉద్యోగం.. అయినా విలాసవంతమైన జీవితం!

మొదటిపేజీ తరువాయి

రాకపోతే కుటుంబ పోషణ భారమై అప్పుల పాలవుతాడు. కానీ ఇక్కడ జీతం రాకపోయినా సదరు అధికారులు అత్యంత విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. దీనికి కారణం.. వారు పనిచేస్తున్న ఫోకల్ పోస్టుల్లో వచ్చే అక్రమ సంపాదన ప్రభుత్వ జీతం కంటే పది నుంచి ఇరవై రెట్లు అధికంగా ఉండటమే. జీతమైతే ఎక్కడికి పోతుంది.. రిటైర్మెంట్ సమయంలోనైనా క్లియర్ చేసుకుని ఏకమొత్తంగా తీసుకోవచ్చు అనే ధీమాతో వారు కనీసం శాలరీ కోసం దరఖాస్తులు కూడా చేయడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**నోటీసులిచ్చినా బేఖాతరు!**

నిబంధనల ప్రకారం అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) గా పనిచేసే సమయంలో ఆయా సర్కిళ్ల పరిధిలో అభివృద్ధి పనులకు తీసుకున్న వర్క్ ఆర్డర్లను సంబంధిత అధికారి అక్కడి నుంచి బదిలీ అయి వెళ్లేలోపే పూర్తిచేసి క్లోజ్ చేయించాలి. కానీ వందలాది మంది అధికారులు వేల సంఖ్యలో వర్క్ ఆర్డర్లను మూసివేయకుండానే ఉన్నత స్థానాలకు పదోన్నతులు పొందారు. దీంతో నిబంధనల ప్రకారం యాజమాన్యాలు వారి నెలవారీ జీతాలను నిలిపివేశాయి. ఆయా డివిజన్ల నుంచి ఎన్నిసార్లు హెచ్చరికలు, నోటీసులు జారీ చేసినా సదరు అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కేవలం కాగితపు నోటీసులకే పరిమితమై, క్రిమినల్ లేదా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ అధికారులు మరింత బరితెగిస్తున్నారు.

**బినామీ కాంట్రాక్టర్లుగా మారిన అధికారులు**

ముఖ్యంగా దక్షిణ మండలానికి చెందిన టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో ఈ బినామీ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే సుమారు 30 మంది ఇంజనీరింగ్ అధికారులు బినామీల పేర్లతో ఫుల్ టైమ్ కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. నగరంలో రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతుండటంతో కొత్తగా వెలుస్తున్న గేటెడ్ కమ్యూనిటీలు, భారీ విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే క్రమంలో బిల్డర్లను ముందే సంప్రదిస్తున్నారు. ప్రభుత్వ అంచనాలు పెరిగే చోట సాంకేతిక లొసుగులు చూపి ఎలా తగ్గించవచ్చో సలహాలు ఇవ్వడమే కాకుండా, మున్సిపల్ నిబంధనల ప్రకారం అవసరమైన ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేకుండానే విద్యుత్ మీటర్లను దొడ్డిదారిన మంజూరు చేయిస్తున్నారు. జీడిమెట్ల డివిజన్‌లో పనిచేసే ఒక ఏడీఈ స్థాయి అధికారి గత రెండేళ్ల కాలంలో తన బినామీ పేరుతో ఏకంగా 16 భారీ పనులను పూర్తి చేసి కోట్లు గడించారంటే వీరి ఆధిపత్యం ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.

**తానే రాజు.. తానే మంత్రి..**

ఒక అధికారి తానే కాంట్రాక్టర్ కావడంతో పనుల పర్యవేక్షణ పూర్తిగా గాల్లో కలిసిపోయింది. వేసిన 33 కేవీ, 11 కేవీ లైన్లలో స్తంభాలు వంగిపోవడం, సరైన ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ చేయకపోవడం, నాసిరకం కేబుళ్లు వాడటం పరిపాటిగా మారింది. చివరకు ఇప్పటికే పూర్తి ఓవర్‌లోడ్‌తో ఉన్న సబ్‌స్టేషన్లలో సైతం లోడ్ లేనట్లు తప్పుడు నివేదికలు సృష్టించి, ప్రైవేటు వ్యక్తుల కోసం సంస్థ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రమాదకర రీతిలో డెడికేటెడ్ ఫీడర్లను మంజూరు చేస్తున్నారు.

**నిజమైన కాంట్రాక్టర్ల పొట్టకొడుతున్నారు**

విద్యుత్ శాఖ పనులపైనే ఆధారపడి బతుకుతున్న చిరు వ్యాపారులు, అర్హత కలిగిన నిరుద్యోగ కాంట్రాక్టర్ల ఉపాధిని ఈ బినామీ అధికారులు పూర్తిగా దెబ్బతీస్తున్నారు. ఎస్టిమేషన్లు వేసే అధికారి, వాటిని ఆమోదించే అధికారి ఒకరే కావడంతో బయటి కాంట్రాక్టర్లకు పనులు దక్కకుండా చక్రం తిప్పుతున్నారు. మేము ఏళ్ల తరబడి పనుల కోసం ఎదురుచూస్తుంటే.. చక్రం తిప్పుతున్న అధికారులే కాంట్రాక్టులను ఎగరేసుకుపోతున్నారు అని నిజమైన కాంట్రాక్టర్లు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగం మేల్కొని గ్రేటర్‌లో బినామీ పేర్లతో కాంట్రాక్టులు చేస్తున్న అధికారులపై ఏసీబీ దాడులు జరపాలని, వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయని వారిని నాన్‌ఫోకల్ పోస్టులకు బదిలీ చేసి వారి అక్రమార్జనపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.




# కళ్యాణలక్ష్మి కేసీఆర్ మానవీయ పాలనకు నిదర్శనం: కేటీఆర్

- **12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు**
- **గిరిజన తండాలో చూసిన ఘటనతో కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం**
- **పేదింటి ఆడబిడ్డల పెళ్లికి రూ.1,00,116 ఆర్థిక సాయం**
- **ఇప్పటివరకు 16.78 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి**
- **కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తోందని కేటీఆర్ ఆరోపణ**

హైదరాబాద్, (సిరి న్యూస్) అక్టోబర్ 2:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మానవీయ పాలనకు కళ్యాణలక్ష్మి పథకం నిలువెత్తు నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పథకం ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'ఎక్స్' వేదికగా ఆయన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఓ గిరిజన తండాలో తాను చూసిన ఘటన కేసీఆర్‌ను ఈ పథకానికి శ్రీకారం చుట్టేలా చేసిందని కేటీఆర్ వివరించారు.

**పేద కుటుంబాలకు అండగా..**

ఆడబిడ్డ పెళ్లి సమయంలో తల్లిదండ్రులపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడిందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలోని లక్షలాది కుటుంబాలకు పెళ్లి సమయంలో కేసీఆర్ మేనమామలా అండగా నిలిచారని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహానికి రూ.1,00,116 ఆర్థిక సాయం అందించాలన్న ఆలోచన కేసీఆర్‌కు వచ్చిందని కొనియాడారు. ఈ పథకం బాల్య వివాహాలను తగ్గించడంలోనూ దోహదపడిందని తెలిపారు.

**16.78 లక్షల కుటుంబాలకు లబ్ధి**

గత 12 ఏళ్లలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా 16.78 లక్షల పేద కుటుంబాలు ప్రయోజనం పొందాయని కేటీఆర్ తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణలక్ష్మి పథకాన్ని నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన తులం బంగారం సంగతి పక్కనపెడితే.. అసలు కళ్యాణలక్ష్మి పథకాన్నే రద్దు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పథకం 12వ వార్షికోత్సవం సందర్భంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

# టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 2 (సిరి న్యూస్):

జాతిపిత మహాత్మా గాంధీ మరియు భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం, మింట్ కాంపౌండ్‌లో గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. వారి దేశసేవను, ఆశయాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ..మహాత్మా గాంధీ దేశానికి సత్యం, అహింస, స్వచ్ఛత, క్రమశిక్షణ వంటి అత్యున్నత విలువలను అందించారని, ఆయన చూపిన మార్గం నేటికీ సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి ప్రజాసేవను తమ ధర్మంగా భావించి బాధ్యతాయుతంగా పనిచేయాలని, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సేవలను అందించడంలో పూర్తి అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబర జీవనం, నిజాయితీ, దేశభక్తి ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. జై జవాన్ జై కిసాన్ అనే ఆయన నినాదం దేశ నిర్మాణంలో రైతులు, సైనికుల కీలక పాత్రను ప్రపంచానికి చాటిచెప్పిందని గుర్తుచేశారు. గాంధీజీ బోధించిన స్వచ్ఛత, క్రమశిక్షణ, ప్రజాసేవా స్ఫూర్తిని ప్రతి ఉద్యోగి తమ విధి నిర్వహణలో విధిగా ఆచరించాలని, ప్రజలకు మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు డిస్కం ఎప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో డిస్కం కమర్షియల్ డైరెక్టర్ సి. చక్రపాణి, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటీ) వి. శివాజీ, డైరెక్టర్ (ఫైనాన్స్) కృష్ణారెడ్డి, చీఫ్ ఇంజనీర్ (కమర్షియల్) ప్రతిమ షోలే, చీఫ్ ఇంజనీర్ (ఐటీ) శివాజీ రాథోడ్, సివిల్ ఎస్ఈ రవికాంత్, జాయింట్ సెక్రటరీ (ఐఆర్) మజాదుల్లా, జనరల్ మేనేజర్ (ఐఆర్, లీగల్ అండ్ మెడికల్) డి. మాధవి తదితర ఉన్నతాధికారులు, ఇంజనీర్లు మరియు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని మహానేతలకు నివాళులర్పించారు.

# నేను పోటీలో ఉన్నా..

సూర్యాపేట, (సిరి న్యూస్), అక్టోబర్ 2:

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థిగా తాను ఎన్నికల బరిలో దృఢంగా నిలుస్తున్నానని రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన ఆయన విడుదల చేశారు. తన పేరును పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించిందని, పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ కాంగ్రెస్ అభ్యర్థిగా తాను ఎన్నికల బరిలో నిలుస్తున్నానని రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. అధిష్ఠానం తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. అయితే తన అభ్యర్థిత్వంపై కొందరు కావాలనే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను టికెట్ అడగలేదని , ఎమ్మెల్సీగా పోటీ చేయడానికి సిద్ధంగా లేనని చేతులెత్తేశారని, యూ టర్న్ తీసుకున్నారని అంటూ ప్రచారం చేయడం దుర్మార్గమని అన్నారు. తాను ఎన్నికల నుంచి తప్పుకుంటానని ఎక్కడ కూడా చెప్పలేదని పేర్కొన్నారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో స్వీకరిస్తున్నానని తెలిపారు. యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం తన లక్ష్యమని తెలిపారు. తన దీర్ఘకాలిక రాజకీయ లక్ష్యాల గురించి గతంలో చెప్పిన విషయాలను ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలతో ముడిపెట్టి వక్రీకరించడం సరికాదని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి, పట్టభద్రుల సమస్యలకు బలమైన ప్రాతినిధ్యం వహించడమేనని తన ప్రస్తుత లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికల బరిలో ఉన్నానని, పట్టభద్రుల ఆశీస్సులతో ముందుకు సాగుతానని ధీమా వ్యక్తం చేశారు.



# ఇకపై అన్ని సబ్జెక్టులకు ప్రాక్టికల్స్?

మొదటిపేజీ తరువాయి

ప్రాక్టికల్స్ ను ఇప్పుడు అన్ని సబ్జెక్టులకు (ఇంటర్నల్ అసెస్మెంట్ రూపంలో) ప్రవేశపెట్టారు. ఈ కొత్త విధానంపై విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. కొత్త విధానం ప్రకారం మొత్తం మార్కుల్లో రాత పరీక్షకు 80శాతం, ప్రాక్టికల్స్ కు 20 శాతం మార్కులను కేటాయించారు. ఒకవేళ ఎగ్జామ్ 80 మార్కులకు ఉంటే విద్యార్థులు పాస్ కావాలంటే కనీసం 28 మార్కులు (35 శాతం) సాధించాల్సి ఉంటుంది. అలాగే ప్రాక్టికల్స్ కు కేటాయిం చిన 20 మార్కులలో కనీసం 7 మార్కులు వస్తేనే పాసైనట్లు లెక్క. సైన్స్ సబ్జెక్టుల విషయానికి వస్తే గతంలో కేవలం సెకండియర్ లోనే ప్రాక్టికల్స్ ఉండేవి. కానీ, ఇకపై ఫస్టియర్ లోసగం, సెకండియర్ లో మరో సగం చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఇంగ్లీష్ సబ్జెక్ట్ విషయంలోనూ బోర్డు స్పష్టతనిచ్చింది. ఫస్టియర్ విద్యార్థులకు ఒకే ఒక పాఠ్య పుస్తకం ఉంటుంది. ఇక సెకండ్ ఇయర్ లో టెక్స్ట్ బుక్‌తోపాటు ప్రత్యేకంగా 'ఇంగ్లిష్ ప్రాక్టికల్ మాన్యువల్' కూడా అందుబాటులో ఉంటుంది. ఈ కొత్త మార్పులు, సిలబస్ వివరాలు, సబ్జెక్టుల వారీగా మార్కుల కేటాయింపు వంటి సమస్త సమాచారాన్ని అధికారిక వెబ్సైట్‌లో పొందుపరిచామని బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు. ఈ కొత్త పరీక్షా విధానంపై విద్యార్థులకు ఎటువంటి గందరగోళం లేకుండా చూడాల్సి న బాధ్యత కళాశాలల యాజమాన్యాలపై ఉం ది. ఏ సబ్జెక్టుకు ఎన్ని మార్కులు ఉంటా యి. పాస్ మార్కులు ఎలా లెక్కగడతారు అనే వివరాలను ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు విద్యా ర్థులకు అర్థమయ్యేలా వివరించాలని బోర్డు ఆదేశించింది.

# ‘సర్’ విచారణ మీ ఇంటి వద్దే..

హైదారాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 2:

రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలను ఇచ్చింది. వోటర్లకు నష్టం జరగకుండా, ఇబ్బంది కలగకుండా వారి వోటుకు భద్రత కల్పించేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను వోటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తాజాగా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సీఈఓ సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా వోటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు వోటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు.ఇకపై సాధారణంగా వోటర్లను విచారణ కోసం కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

- **దశాబ్దాలుగా ప్రభుత్వాలు నిర్మించిన ప్రజల ఆస్తులివి**
- **కాంగ్రెస్ జాతీయ విధానం ఒకలా, తెలంగాణలో మరోలా ఏంటి?**
- **రాయపూర్ ఆర్థిక తీర్మానాలను రాష్ట్ర ప్రభుత్వం పాటిస్తుందా?**
- **రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ**



హైదరాబాద్, (సిరి న్యూస్), అక్టోబర్ 2:

టీజీట్రాన్స్‌కో, టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంలు, ఇతర వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలపై కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత టీజీట్రాన్స్‌కో 26 శాతం ఈక్విటీ డైల్యూషన్/ఐపీఓ (వాటా తగ్గింపు) నిర్ణయం మొత్తం ప్రభుత్వ విద్యుత్ సంస్థల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నదన్నారు. ఇది రాష్ట్రంలోని వ్యూహాత్మక విద్యుత్ మౌలిక వసతుల భవిష్యత్ యాజమాన్యం, నియంత్రణకు సంబంధించిన కీలక అంశమని, టీజీట్రాన్స్‌కో ఒక సాధారణ వాణిజ్య సంస్థ కాదని, తెలంగాణ విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన కీలక ప్రజా సంస్థ అని గుర్తు చేశారు. టీజీట్రాన్స్‌కో పరిధిలో 29,400 కేవీ సబ్‌స్టేషన్లు, 107, 220కేవీ సబ్‌స్టేషన్లు, 337, 132కేవీ సబ్‌స్టేషన్లు, 31,420కు పైగా సర్క్యూట్ కి.మీ ఈహెచ్ టీ లైన్లు, 1,184 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 43,848 ఎంవీఏ ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యం ఉన్నాయని తెలిపారు. దశాబ్దాలుగా ప్రజాధనంతో, గత ప్రభుత్వాల కృషితో నిర్మించిన ఈ ప్రభుత్వ ఆస్తులను రాత్రికి రాత్రి ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. 26 శాతం వాటా తగ్గింపు మొదటి అడుగు మాత్రమే.. భవిష్యత్తులో మిగిలిన వాటాను కూడా ప్రైవేటు చేతుల్లోకి అప్పగించే మార్గాన్ని సుగమం చేస్తున్నారు.. అంటే టీజీట్రాన్స్‌కో తర్వాత టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంలు కూడా ఇదే బాట పట్టనున్నాయా అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని ఢిల్లీలో కాంగ్రెస్ ఒక మాట.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మరో మాటా అని నిలదీశారు. కాంగ్రెస్ 2019 మేనిఫెస్టోలో వ్యూహాత్మకేతర, నాన్‌కోర్ ప్రభుత్వ రంగ సంస్థలకే డిజ్‌ఇన్వెస్ట్‌మెంట్‌ను పరిమితం చేయాలని పేర్కొందన్నారు. 2023 రాయ్‌పూర్ కాంగ్రెస్ ప్లీనరీ ఆర్థిక తీర్మానంలో కూడా డిజ్‌ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రైవేట్ మోనోపాలీలు, డ్యూపాలీలు ఏర్పడకూడదని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మరి రాష్ట్రంలో వ్యూహాత్మక విద్యుత్ సంస్థ అయిన టీజీట్రాన్స్‌కోలో ఈక్విటీ డైల్యూషన్ ఏ కాంగ్రెస్ విధానం ప్రకారం చేస్తున్నారు.. కాంగ్రెస్ సీడబ్ల్యుసీ తీర్మానాలు ఢిల్లీకి మాత్రమే పరిమితమా.. తెలంగాణలో వర్తించవా అని నిలదీశారు. మీరు కేంద్ర ప్రభుత్వ ప్రజా ఆస్తుల మానిటైజేషన్, ప్రైవేటీకరణ విధానాలను పదేపదే ప్రశ్నించారు.. ఎల్ఐసీ, విద్యుత్ రంగం వంటి వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా తగ్గింపుపైనా మీరు ఆందోళనలు వ్యక్తం చేశారు.. అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌తో పాటు కాంగ్రెస్ అధికారంలో లేని ఇతర రాష్ట్రాల్లో విద్యుత్ రంగ ప్రైవేటీకరణను కాంగ్రెస్ వ్యతిరేకించింది.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఈ రాష్ట్రంలో అదే సూత్రం వర్తించాలి అని స్పష్టం చేశారు. టీజీట్రాన్స్‌కో ప్రైవేటీకరణపై రాహుల్‌గాంధీ మౌనం వహిస్తే.. కాంగ్రెస్ జాతీయ విధానం, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ విధానం ఒక్కటి కానట్లేనా? తెలంగాణ ప్రభుత్వాన్ని సూటిగా అడుగుతున్నాం..టీజీట్రాన్స్‌కోలో 26 శాతం వాటా ఎందుకు తగ్గిస్తున్నారు? టీజీజెన్‌కోకు సంబంధించి ఏం చేయబోతున్నారు?సింగరేణిపై ఎలాంటి ప్రతిపాదనలు ఉన్నాయి? డిస్కంల భవిష్యత్ యాజమాన్యంపై ప్రభుత్వం ఆలోచన ఏమిటి? ప్రజల ఆస్తులను ప్రజల అనుమతి లేకుండా ప్రైవేట్ ప్రయోజనాలకు అప్పగించే నిర్ణయాలు తీసుకోవద్దు.

ప్రభుత్వ ఆస్తుల యాజమాన్యం లేదా నియంత్రణను ప్రభావితం చేసే నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలి. టీజీట్రాన్స్‌కో ఐపీఓ, 26 శాతం ఈక్విటీ డైల్యూషన్‌ను తక్షణమే నిలిపివేయాలి. టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంలు, ఇతర వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థలపై ఐపీఓ, ఈక్విటీ డైల్యూషన్, ప్రైవేటీకరణ ఆలోచనలను ఉపసంహరించుకోవాలి. ఈ ప్రతిపాదనలు కాంగ్రెస్ 2019 మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ ఆర్థిక తీర్మానాలకు ఎలా అనుగుణంగా ఉన్నాయో తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ విధానం మారితే బహిరంగంగా ప్రకటించాలి.. విధానం మారకపోతే తెలంగాణ ప్రభుత్వాన్ని నిలువరించాలి.. ఒక జాతీయ పార్టీ విశ్వసనీయత తీర్మానాలు చేయడంలో కాదు.. వాటిని అమలు చేయడంలో ఉంటుంది అని పేర్కొన్నారు. అందుకే రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వెంటనే జోక్యం చేసుకుని టీజీట్రాన్స్‌కో ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. టీజీట్రాన్స్‌కోతో మొదలయ్యే ప్రైవేటీకరణకు ఇక్కడే అడ్డుకట్ట వేయాలి.. టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంలను కూడా ప్రైవేటీకరణ బారి నుంచి కాపాడాలి అని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ద్వంద్వ విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారన్న విషయం గుర్తించి వ్యవహరించండి అని హరీష్‌రావు హితవు పలికారు.

# బాపూ ఘాట్‌లో మహాత్ముడికి నివాళులు

హైదరాబాద్, (సిరి న్యూస్), అక్టోబర్ 2 :

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా లంగర్ హౌస్‌లోని బాపూ ఘాట్‌లో ఆయనకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు ఘన నివాళులర్పించారు. గాంధీ చూపిన అహింస, సత్యాగ్రహంలను, దేశానికి ఆ మహనీయుడు అందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజరుద్దీన్, పొన్నం ప్రభాకర్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం బాపూ ఘాట్‌లో డిజిటల్ మ్యూజియాన్ని గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.



# ప్రజా రవాణాలో డిజిటల్ విప్లవం







**మొదటిపేజీ తరువాయి**

ప్రజాపాలనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం, ఆర్టీసీ మరియు హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థలు సంయుక్తంగా 'ఆర్టీసీ మెట్రో కామన్ పాస్', 'మీ టికెట్' మొబైల్ యాప్, డిజిటల్ వీక్లీ బస్ పాస్‌లను అధికారికంగా అందుబాటులోకి తీసుకొచ్చాయి. హైదరాబాద్ ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ఈ వేడుకలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ నూతన సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ విప్‌లు పట్నం మహేందర్ రెడ్డి, అద్దంకి దయాకర్, సీఎస్ సంజయ్ జాజు, రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మెట్రో సలహాదారు ఎన్వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఒకే పాస్‌తో ఆర్టీసీ-మెట్రో ప్రయాణం**

హైదరాబాద్‌లో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రజలు ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్లను వినియోగిస్తున్న నేపథ్యంలో రెండు రవాణా వ్యవస్థలను అనుసంధానిస్తూ 'కామన్ పాస్'ను ప్రవేశపెట్టారు. ఈ పాస్‌తో ఓఆర్ఆర్ పరిధిలో నడిచే ఆర్టీసీ సిటీ బస్సుల్లో, మెట్రో రైళ్లలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించవచ్చు. అన్ని మెట్రో స్టేషన్లలో ఈ కామన్ పాస్‌లు అందుబాటులో ఉంటాయని, మొదటిసారి కార్డు తీసుకునేటప్పుడు రూ.100 డిపాజిట్ చెల్లించాలని, కార్డు తిరిగి అప్పగించినప్పుడు ఆ మొత్తాన్ని రీఫండ్ చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కామన్ పాస్ ద్వారా మెట్రో స్టేషన్ల నుంచి నివాస, వాణిజ్య ప్రాంతాలకు 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ' మరింత సులభతరం కానుంది. అంతేకాకుండా ప్రజా రవాణా వినియోగం పెరగడం ద్వారా ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యం తగ్గేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుంది.

**కొత్త యాప్‌తో డిజిటల్ ప్రయాణం**

సిటీ బస్సు ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా మీ టికెట్ మొబైల్ యాప్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ప్రయాణికులు మొబైల్‌లోనే బస్ టికెట్లు కొనుగోలు చేయడం, బోర్డింగ్ పాయింట్ గమ్యస్థానాన్ని ఎంచుకోవడం, ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరపడం వంటివి చేసుకోవచ్చు. డైనమిక్ క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ టికెట్ లేదా రోజువారీ, వారపు, నెలవారీ పాస్‌లను సులభంగా పొందవచ్చు. దీనివల్ల కాగితపు టికెట్ల అవసరం తగ్గడంతో పాటు చిల్లర సమస్యలకు పూర్తిగా చెక్‌పడినట్లవుతుంది. అలాగే రోజువారీ ప్రయాణికుల సౌకర్యార్థం రూ.600లతో డిజిటల్ వీక్లీ బస్ పాస్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు.

**12 సంవత్సరాల తర్వాత ఆటో రిక్షా చార్జీల సవరణ**

ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీ, మెట్రోతో పాటు ఆటో రంగాన్ని కూడా భాగస్వామిగా గుర్తిస్తూ.. దాదాపు 12 సంవత్సరాల తర్వాత (ఫిబ్రవరి 2014 తర్వాత తొలిసారిగా) ఆటో రిక్షా చార్జీలను ప్రభుత్వం సవరించింది. ఆటో కార్మికుల జీవనోపాధి, పెరిగిన నిర్వహణ వ్యయాలు, ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. మొదటి 1.6 కిలోమీటర్లకు కనీస చార్జీ రూ. 30, ప్రతి తదుపరి కిలోమీటర్‌కు రూ. 14, నిరీక్షణ చార్జీ నిమిషానికి రూ. 0.75, రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు: సాధారణ చార్జీకి 1.5 రెట్లు. అలాగే ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.



**హైదరాబాద్ అభివృద్ధికి రూ.52 వేల కోట్ల పనులు: డిప్యూటీ సీఎం**

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజాపాలనలో హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ.52 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో రూ.35 వేల కోట్లతో రోడ్లు, ఫ్లైఓవర్లు, బ్రిడ్జిల పనులు చేపట్టినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణాను మరింత మెరుగుపరిచేందుకు సుమారు రూ.38 వేల కోట్లతో 122 కిలోమీటర్ల మేర మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టును చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ అనుసంధానానికి 21 రేడియల్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని, వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ బస్సులు, ఆటోల రెట్రోఫిట్టింగ్‌కు రూ.200 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. కామన్ పాస్ విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మంత్రులందరి తరపున డిప్యూటీ సీఎం స్వయంగా వన్‌డే కామన్ పాస్‌లను కొనుగోలు చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి ఈ కామన్ పాస్‌తో మంత్రులంతా కలిసి మెట్రోలో, అనంతరం ఆర్టీసీ బస్సులో ప్రయాణించనున్నారు. భవిష్యత్ తరాల కోసం విజన్2047 లక్ష్యంగా సమగ్ర, సురక్షితమైన ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# పింఛన్‌కు రూ.10 వేల లంచం?..






- **పింఛన్ కోసం రూ.10 వేల డిమాండ్?..**
- **లంచం ఇవ్వకుంటే పింఛన్ ఆపేస్తానని హెచ్చరిక?..**
- **వార్డు అధికారిపై కమిషనర్‌కు ఫిర్యాదు..**
- **ఫిర్యాదుతో కార్పొరేషన్‌లో కలకలం**
- **కదిలిన అధికారులు.. విచారణ షురూ..**

**మంచిర్యాల, (సిరి న్యూస్ అక్టోబర్ 1:**

ఏసీబీ వలలో అవినీతి అధికారులు పడుతున్న ఘటనలు రాష్ట్రంలో నిత్యం వార్తల్లో నిలుస్తున్నా, కొందరు అధికారుల తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదా? పేదలు, వృద్ధుల జీవనాధారమైన పింఛన్ కోసం కూడా లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు మంచిర్యాల కార్పొరేషన్‌లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. వార్డు అధికారి తనను రూ.10 వేలు అడిగారంటూ ఓ మహిళ నేరుగా కమిషనర్‌కే లిఖితపూర్వక ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది..

**అసలేం జరిగింది?..**

శ్రీరాంపూర్ 29వ డివిజన్‌కు చెందిన కూకుట లక్ష్మి తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ వార్డు అధికారి రవికిరణ్‌ను సంప్రదించారు. అయితే పింఛన్ ఇప్పించాలంటే రూ.10 వేలు లంచం ఇవ్వాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారని లక్ష్మి ఆరోపించారు. అంతేకాదు, డబ్బులు ఇవ్వకపోతే పింఛన్ రాకుండా చేస్తానని బెదిరించారని కూడా ఆమె వాపోయారు..

**కమిషనర్ గడప తొక్కిన బాధితురాలు..**

న్యాయం కోసం గురువారం మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్‌ను కలిసిన లక్ష్మి, లిఖితపూర్వకంగా ఫిర్యాదు సమర్పించారు. అర్హత ఉన్నప్పటికీ లంచం కారణంగా పింఛన్ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని, వార్డు అధికారి రవికిరణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు..

**ఏసీబీ దాడులు జరుగుతున్నా..మారని తీరు!..**

రాష్ట్రవ్యాప్తంగా లంచగొండి అధికారులను ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్న ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. అయినా క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు లంచాలకు అలవాటుపడి, సామాన్యులను పీడిస్తున్నారన్న విమర్శలు ప్రజల్లో బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా అర్హులకు చేరాల్సిన చోట, మధ్యలో ముడుపులు అడ్డుగోడలా మారితే పేదలు ఎవరిని నమ్మాలి? ఎక్కడికి వెళ్లాలి? అన్నదే ఇప్పుడు ప్రజల ప్రశ్న..

**విచారణకు కదలిక..**

ఫిర్యాదు నేపథ్యంలో వార్డు అధికారి రవికిరణ్‌పై విచారణ జరుగుతున్నట్లు సమాచారం. ఆరోపణల్లో నిజానిజాలు విచారణలో తేలాల్సి ఉంది..

**అవినీతికి అడ్డుకట్ట పడుతుందా? వేచి చూడాల్సిందే!..**

అర్హులైన పేదలు, వృద్ధులకు అందాల్సిన పింఛన్ కోసం కూడా లంచం అడిగారన్న ఆరోపణలు నిజమైతే అది క్షమించరాని విషయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఉదంతంపై విచారణ ఎంత పారదర్శకంగా సాగుతుంది? బాధ్యులపై ఎలాంటి చర్యలు ఉంటాయి? బాధితురాలికి న్యాయం జరుగుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో అవినీతికి అడ్డుకట్ట పడుతుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే!..

# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

- **19వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు**
- **కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం**
- **ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి**

**హైదారాబాద్, (సిరి న్యూస్) అక్టోబర్ 2:**

రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందిం చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్ స్టేషన్లలోని లాగ్ బుక్ లను తనిఖీ చేసినప్పుడు కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి ఐదువేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సహకారం

**హైదరాబాద్, (సిరి న్యూస్), అక్టోబర్ 2 :**

ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ అమలులో విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని, వారి శారీరక పెరుగుదల, విద్య పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులకు సూచించారు. ఆహార పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లు ఒప్పందం చేసుకున్నాయి. అందుకు సంబంధించిన చెక్కులను సీఎం చేతుల మీదుగా ఆయన నివాసంలో హరేకృష్ణ ఫౌండేషన్‌కు ఆయా సంస్థల ప్రతినిధులు శుక్రవారం అందజేశారు. నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం జున్నా సోలార్ సిస్టమ్స్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈవో అనిల్ బాబులు రూ.5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్‌లు రూ.4 కోట్ల చెక్కును అందించగా ముఖ్యమంత్రి ఆ సంస్థల ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ

## ముఫ్త్ బిజ్లీ యోజనపై విస్తృత అవగాహనకు

# సేవా సేతు అభియాన్

- **అక్టోబర్ 2 నుండి 4 వరకు ప్రత్యేక శిబిరాలు**
- **టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్**

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 2 (సిరి న్యూస్):**

ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న సేవా సేతు అభియాన్ కార్యక్రమంలో భాగంగా.. సనత్‌నగర్‌లోని టిమ్స్ వద్ద ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహన శిబిరాన్ని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఎంఎస్‌జీఎంబీవై ప్రత్యేక ప్రచార బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. అక్టోబర్ 2 నుండి 4 వరకు మూడు రోజుల పాటు ఈ ప్రత్యేక అవగాహన కార్యక్రమం కొనసాగనుంది. ఈ శిబిరాల ద్వారా గృహ వినియోగదారులకు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునే విధానం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న భారీ సబ్సిడీలు, దరఖాస్తు చేసుకునే పద్ధతి ఈ పథకం ద్వారా లభించే దీర్ఘకాలిక ప్రయోజనాలపై పూర్తి సమాచారం అందించనున్నారు. ఈ సందర్భంగా సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన దేశంలో స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమం అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకొని కరెంట్ బిల్లులను గణనీయంగా తగ్గించుకోవచ్చని చెప్పారు. అంతేకాకుండా, ఇళ్లపై ఉత్పత్తి అయ్యే అదనపు విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌కు అందించడం ద్వారా ఆర్థిక ప్రయోజనాలను కూడా పొందవచ్చని వివరించారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు, సబ్సిడీ వర్తించే విధానం, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకే టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో 'సేవా సేతు అభియాన్' శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పీఎం సూర్య ఘర్ పథకంలో పెద్ద ఎత్తున పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో బంజారాహిల్స్ డివిజన్ టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్ ఎ.వి. రామారావు, ఐసీఎస్సీ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ స్వాతి, అమీర్‌పేట్ ఏడీఈ బాలకృష్ణ, పలువురు సోలార్ వెండర్లు, వినియోగదారులు మరియు డిస్కం సిబ్బంది పాల్గొన్నారు.

# జీవో నంబర్ 25 రద్దు చేయాలి



- **ప్రభుత్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి**
- **ఎస్‌జీటీయూ డిమాండ్**
- **మహాత్మా గాంధీ జయంతి వేడుకల స్ఫూర్తితో 33 జిల్లాల్లో వినతిపత్రాల సమర్పణ**

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 2 (సిరి న్యూస్):**

ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగాన్ని పూర్తిగా నీరుగారుస్తున్న జీవో నంబర్ 25ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు హోరెత్తాయి. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ ఆందోళనల్లో ఎస్‌జీటీయూ రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, మెదక్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జింక అశోక్, ఊకంటి విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రాథమిక విద్య మనుగడే ప్రశ్నార్థకం**

ఈ సందర్భంగా కరీంనగర్, మెదక్ జిల్లాల్లో నిర్వహించిన కార్యక్రమాలలో నేతలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఉపాధ్యాయులను విదేశాలకు పంపి అక్కడ అమలవుతున్న విద్యా విధానాలను అధ్యయనం చేయాలని చెబుతుండగానే.. మరోవైపు అశాస్త్రీయ నిబంధనలతో కూడిన జీవో నంబర్ 25ను తీసుకొచ్చి ప్రాథమిక విద్యను భ్రష్టుపట్టిస్తోందని మండిపడ్డారు. 20 నుండి 60 మంది విద్యార్థులున్న పాఠశాలలో కేవలం ఇద్దరు ఉపాధ్యాయులతో ఐదు తరగతులు, 18 సబ్జెక్టులు, సహ పాఠ్యాంశాలు, బోధనేతర కార్యక్రమాలు నిర్వహించడం అసాధ్యమని స్పష్టం చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రే విద్యాశాఖను నిర్వహిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయి వాస్తవాలను అధికారులు సరిగా అంచనా వేయకపోవడం వల్లే ఇలాంటి జీవోలు వస్తున్నాయని ఆరోపించారు. ఎఫ్ఎల్ఎన్, రెమెడియల్ టీచింగ్ వంటి పేర్లతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని గుణాత్మక విద్యలో ప్రథమ స్థానంలో నిలపడానికి 40 వేల మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని, కానీ ఇలాంటి జీవోలు వారి ఉత్సాహాన్ని దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన ఆమరణ దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో.. గాంధీ జయంతి వేడుకల సందర్భంగా జిల్లాల వారీగా నిరసనలు తెలిపి అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు నేతలు వెల్లడించారు. జోగులాంబ గద్వాల జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఇదే డిమాండ్‌తో ఉపాధ్యాయులు కదం తొక్కారు. ప్రాథమిక పాఠశాల బలపడితేనే విద్యార్థి భవిష్యత్తు బలపడుతుంది అని పేర్కొంటూ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి జీవోను సవరించాలని గట్టిగా డిమాండ్ చేశారు.

# మహాత్మ గాంధీ 157వ జయతి వేడుకల్లో పాల్గొన్న కొంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు



**కొంపల్లి.అక్టోబర్.02(సిరి న్యూస్).**

మహాత్మ గాంధీ 157వ జయంతిని పురస్కరించుకొని కొంపల్లిలోని గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు అదిరెడ్డి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమా వేసి నివాళ్లు అర్పించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారం గోపాల్ రెడ్డి.లేబర్ సెల్ జిల్లా అధ్యక్షులు కందాడి సుదర్శన్ రెడ్డి.ఉపేందర్ రెడ్డి.కావాలి గోపాల్ ముదిరాజ్.వెంకటేష్ యాదవ్.షేక్ ఇబ్రహీం.కృష్ణ.అశోక్ రెడ్డి.పూర్ణచందర్ రావ్.గోపాల్ రెడ్డి.వెంకట్ రెడ్డి. రాజశేఖర్.ఎత్తి రాజు.అంజి ముదిరాజ్. తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ తూప్రాన్ మనందరి బాధ్యత



**తూప్రాన్ అక్టోబర్ 2 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలోని 1వ వార్డులో శుక్రవారం చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగినది.

తడి పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేయాలి తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛతను మరింత మెరుగుపరచే చర్యల్లో భాగంగా 1వ వార్డులో ప్రజలకు చెత్త బుట్టలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ బొంది రజని రవీందర్ గౌడ్ పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ కె. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే తడి చెత్త పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రజలకు ప్రత్యేకంగా చెత్త బుట్టలను అందజేశారు. తడి చెత్తను

ఒక బుట్టలో పొడి చెత్తను మరో బుట్టలో వేసి పారిశుధ్య సిబ్బందికి వేర్వేరుగా అందించాలని అధికారులు సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఇంటి వద్దనే తడి పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. స్వచ్ఛ తూప్రాన్ మనందరి బాధ్యత అనే నినాదంతో ప్రతి ఒక్కరి బాధ్యత తూప్రాన్‌ను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని చైర్మన్ కమిషనర్ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు.

# ప్రమాదకరంగా కరెంటు తీగలు



- **విద్యుత్ అధికారి వెంటనే స్పందించాలి**

**వెల్దుర్తి, అక్టోబర్ 02,( సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండల కేంద్రంలో గల కోటకింద కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన కమిటీ హల్ పైన ఆనుకొని కరెంటు తీగలు వేలాడుతున్నాయని, ఇట్టి కమిటీ హాల్ పక్కనే ప్రాథమిక పాఠశాల ఉన్నందున పాఠశాలకు వచ్చు విద్యార్థులు కమిటీ హాలు మెట్ల పైన ఆడుతున్నారు. ప్రమాదం పొంచి ఉన్నందున సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే కరెంట్ తీగలు సరిచేయగలరని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రమాదాలు ఎప్పుడూ చెప్పి జరగవు. కావున విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వాటిని సరి చేయగలరని కాలనీ వాసులు కోరుతున్నారు.

# హఫీజ్‌పేట్‌లో హడలెత్తిస్తున్న వీధి కుక్కలు!



- **రంగంలోకి వైద్య ఆరోగ్య శాఖ**
- **ప్రజలకు సూచనలు**

**హఫీజ్‌పేట్,అక్టోబర్ 2 (సిరి న్యూస్):**

హఫీజ్‌పేట్ పరిధిలో వీధి కుక్కల సంచారం, కుక్కకాటు ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్థానికంగా పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణకుమారి ఆదేశాలతో ప్రోగ్రాం ఆఫీసర్ డా. రాకేష్ నేతృత్వంలో హెల్త్ సూపర్‌వైజర్లు, స్థానిక వైద్యాధికారి, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, వీధి కుక్కలను రెచ్చగొట్టకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కుక్కల నియంత్రణకు జిహెచ్ఎంసి అధికారులు యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబిసి) కార్యక్రమాన్ని వేగవంతం చేయడంతో పాటు యాంటీ రేబిస్ టీకాలు అందించే చర్యలు చేపట్టాలని వైద్య శాఖ అధికారులు కోరారు. కుక్క కరిచిన సందర్భంలో ఇంటి చిట్కాలతో కాలయాపన చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

# గాంధీజీ ఆశయాలే నేటి తరానికి మార్గదర్శకం

- **సత్యం, అహింసా మార్గాలను అనుసరించాలి: మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్**

**గుమ్మడిదల, అక్టోబర్ 2 (సిరి న్యూస్):**



జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింసా సిద్ధాంతాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని గురువారం గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న మహాత్మా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎలాంటి హింసకు తావులేకుండా సత్యం, అహింస, సత్యాగ్రహ మార్గాల ద్వారా మహాత్మా గాంధీజీ సాగించిన స్వాతంత్ర్య పోరాటం ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన విధానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను కేవలం జయంతి రోజున స్మరించుకోవడమే కాకుండా వాటిని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని సూచించారు. సత్యం, అహింసా మార్గాలను అనుసరించడం ద్వారా సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యత మరింత బలోపేతం అవుతాయని అన్నారు. గాంధీజీ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య, కౌన్సిలర్లు మాధవి, చక్రపాణి, కిషన్, కత్తుల రమేష్, రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, శేఖర్ రెడ్డి, సత్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళులు**

గుమ్మడిదల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. సత్యం, అహింసా సిద్ధాంతాలతో గాంధీజీ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరేశం, కాలభైరవ వెంకటేష్, రామచందర్, ధనంజయ, సతీష్, శ్రీనివాస్, అంజయ్య, బాల్ లింగం, శంకర్, సతీష్ కుమార్, లక్ష్మణ్, మురళీధర్, రాజ్ కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ గాంధీ మరియు శాస్త్రి జయంతి వేడుకలు

**దూలపల్లి.అక్టోబర్.02(సిరి న్యూస్).**

జాతిపిత మహాత్మా గాంధీ మరియు మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను దూలపల్లి డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షురాలు బురుగుబావి దుర్గా ఆధ్వరంలో మహాత్మ గాంధీ 157వ జయంతితో పాటు శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు.పరిశుభ్రత అనేది ప్రభుత్వ కార్యక్రమానికే పరిమితం కాకుండా ప్రతి పౌరుడి బాధ్యతగా మారాలని నాయకులు పిలుపునిచ్చారు.గాంధీజీ చూపిన అహింస,సత్యం,పరిశుభ్రత మార్గాలను లాల్‌బహదూర్ శాస్త్రి అందించిన సరళత,దేశభక్తి,కర్తవ్యనిష్ఠను నేటి తరానికి ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.దేశాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని స్వచ్ఛమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బురుగుబావి అశోక్,చింతల నరసింహ,చింతల సత్యనారాయణ,బురుగుబావి నర్సింగరావు,దుర్గం శేఖర్,దుర్గం కుమార్,గరిసె అశ్విన్,గంగయోల శివుడు,గౌరెంకల భాస్కర్,గౌరెంకల శ్రీశైలం,బురుగుబావి మహేష్,మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి

- **పండ్ల పంపిణీ, నిత్యవసర సరుకుల పంపిణీ.**
- **జిల్లా అధ్యక్షులు కరణం సందీప్.**

**సదాశివపేట. అక్టోబర్ 2. (సిరిన్యూస్)**



సేవాదళ్ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు జితేందర్, తూర్పు జయప్రకాశ్ రెడ్డి, నిర్మల జగ్గారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు కరణం సందీప్ ఆధ్వర్యంలో సంగారెడ్డి,కొండాపూర్, సదాశివపేట మండల సేవాదళ్ కమిటీ నాయకులతో గాంధీ జయంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో నిత్యవసర సరుకులు, పండ్ల పంపిణి చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కరణం సందీప్ మాట్లాడుతూ ముందు ముందు సేవాదళ్ ఆధ్వర్యంలో లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని, సమాజంలోని సేవ కార్యక్రమాలు చెయ్యడానికి సహకరించిన తూర్పు జయప్రకాశ్ రెడ్డికి, నిర్మల జగ్గారెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.మహాత్మా గాంధీజీ మన దేశానికి చేసిన సేవలు ఎన్నడు కూడా మరువలేనివని ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మండల అధ్యక్షులు శ్రీనివాస్, కొండాపూర్ మండల అధ్యక్షులు మహేందర్ గౌడ్, సదశివాపేట మండల అధ్యక్షులు నర్సింలు, వివిధ మండలలా సేవాదళ్ నాయకులు పాల్గొన్నారు.

# పేట్‌బషీరాబాద్ నూతన సి.ఐ ని కలిసిన కొంపల్లి కాంగ్రెస్ నాయకులు



**కొంపల్లి.అక్టోబర్.02(సిరి న్యూస్).**

పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో నూతన సి.ఐ గ బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ రెడ్డిని కొంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి ఆధ్వరంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలుతో సత్కరించి స్వాగతం తెలిపారు. గత సి.ఐ.విజయ్ వర్ధన్ 2సంవత్సరాలుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకునే విధానాన్ని గుర్తు చేసుకున్నారు .ఈ కార్యక్రమంలో మోహన్ రెడ్డితో పాటు నాయకులు వెంకటేష్ యాదవ్.ఉపేదర్ రెడ్డి.సుదర్శన్ రెడ్డి.గోపాల్ రెడ్డి. షేక్ ఇబ్రహీం.అశోక్ రెడ్డి.కృష్ణ.పాల్గొన్నారు.

# కొంపల్లిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన ఎం.పి.ఈటల రాజేందర్

- **పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి.**
- **మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్**

**కొంపల్లి.అక్టోబర్.02(సిరి న్యూస్).**



జాతిపిత మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని కొంపల్లి బిజెపి అధ్యక్షులు పెద్ద బుద్ధుల సతీష్ సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి,రాష్ట్ర నాయకులు డా.ఎస్.మల్లారెడ్డి మరియు మూగ జయశ్రీ పాల్గొని మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు శాలువాతో సన్మానించి సమాజ ఆరోగ్యం,పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి అని కొనియాడారు.భారత ప్రధాని మోదీ సూచన మేరకు కొంపల్లి ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలే స్ఫూర్తిగా మోదీ స్వచ్ఛ భారత్‌కు పిలుపు ఇచ్చారని పరిశుభ్రత,సేవాభావం ,సామాజిక బాధ్యతను ప్రతి ఒక్కరూ ఆచరించాలని తెలిపారు.పారిశుధ్య కార్మికులు వారి ఉద్యోగ మరియు దైనందిత జీవితంలో పడుతున్న కష్టాలను వివరంగా అడిగి తెలుసుకున్న ఈటల వారి స్థితిగతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంచి మార్పులు వచ్చేలా కృషిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా నాయకలు శేఖర్ యాదవ్, జిల్లా నాయకులు శివాజీ రాజు,శంకర్ నాయక్, బహదూర్పల్లి డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్,కొంపల్లి బీజేవైఎం అధ్యక్షుడు మహేందర్ సాగర్,స్థానిక నాయకులు మాధురి,మధు,మహేశ్వర్ రెడ్డి,ఆకుల శ్రీనివాస్,శ్రీనివాస్,తిరుపతి,నరసింహ,శ్రీకాంత్,అశ్విన్,శేఖర్, దేవిక,లక్ష్మణ్,భీమ,సందీప్,రాజేష్,మహేశ్,శ్రీకాంత్ గౌడ్,వాసు,సాయి ముదిరాజ్,మురళీకృష్ణ తదితర బీజేపీ నాయకులు మరియు స్థానికులు పాల్గొన్నారు.



# గాంధీజీ బాటలో సమాజ నిర్మాణానికి కృషి చేయాలి



- **సత్యం,అహింసే శాంతియుత సమాజానికి పునాది..సీపీ డా.ఎం.రమేష్**

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 2(సిరి న్యూస్):**

జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ అనుసరించిన సత్యం, అహింస, శాంతి, క్రమశిక్షణ సూత్రాలు నేటి సమాజానికి కూడా ఎంతో ప్రాసంగికమని అన్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో శాంతి, సోదరభావం, సామరస్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు రక్షణ కల్పిస్తూ చట్టాన్ని గౌరవించడం, బాధ్యతతో విధులు నిర్వర్తించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని తెలిపారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, శాంతియుత, సమానత్వ సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, అదనపు డీసీపీలు షమీర్, హన్మంత్ రావు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**పెద్ద శంకరంపేట, అక్టోబర్ 2, (సిరి న్యూస్):**

గాంధీ జయంతి పురస్కరించు కొని పెద్ద శంకరంపేట లోని మహాత్మా గాంధీ విగ్రహానికి శుక్రవారం పేట సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్, వార్డు సభ్యులు ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం బాధ్యులు బిజెపి నాయకులు పూల మాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా జరుపు కున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాజ్ గౌడ్, ఆర్యవైశ్య సంఘం బాధ్యులు కందుకూరి రవీందర్, మల్లేశం, తుమునూరి రవీందర్, అనిల్, రాగం శ్రీనివాస్, అనిల్ కుమార్, బిజెపి మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, నాయకులు కృష్ణ, ధ్రువ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల హక్కుల కోసం గళమెత్తిన కలం సైన్యం

- చందానగర్‌లో వర్కింగ్ జర్నలిస్టుల డిమాండ్స్ డే.. గాంధీ విగ్రహానికి నివాళులు



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 2 (సిరి న్యూస్):** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన వర్కింగ్ జర్నలిస్టుల డిమాండ్స్ డే కార్యక్రమం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొండ విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జర్నలిస్టుల హక్కులు, సంక్షేమంపై నేతలు మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు పటిష్టమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు కోరారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు జర్నలిస్టులకు పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులు, బస్‌పాసులు, హెల్త్‌కార్డులు, ఇన్సూరెన్స్, ఇళ్ల స్థలాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టి నూతన మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులపై దాడుల నిరోధానికి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లాలోని వివిధ నియోజకవర్గాలు, ప్రెస్‌క్లబ్‌లకు చెందిన జర్నలిస్టులు, యూనియన్ నాయకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

- పాత్రికేయుల డిమాండ్లు పరిష్కరించాలి.
- గాంధీ విగ్రహం ముందు టియూడబ్ల్యూజే
- ఆధ్వర్యంలో 'డిమాండ్స్ డే'
- కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం.



**మెదక్ అక్టోబర్,02(సిరి న్యూస్)** దేశవ్యాప్తంగా పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్లు పరిష్కరించాలని ఐజేయూ పిలుపు మేరకు టియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రం మెదక్ రాందాస్ చౌరస్తాలో డిమాండ్స్ డే నిరసన చేపట్టి, కలెక్టర్ ఏఓ యూనుస్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు ఎ. శంకర్ దయాళ్ చారి మాట్లాడుతూ... జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా 'పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్ల దినం'గా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ రంగాన్ని సమగ్రంగా సమీక్షించి, ఆధునిక యుగానికి అనువైన విధాన సిఫార్సులను రూపొందించడానికి ఒక కొత్త మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయడం అత్యవసరమన్నారు. పాత్రికేయులు, మీడియా సంస్థల భద్రత కోసం ఒక ప్రత్యేక కేంద్ర చట్టాన్ని రూపొందించాలన్నారు. పత్రికా రంగం భారత ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభంగా పనిచేస్తుందని, స్వతంత్ర, సురక్షితమైన మీడియా వాతావరణం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి పునాది కావాలన్నారు శారీరక దాడులు, ఏకపక్ష నిర్బంధాలు, ఆన్‌లైన్ వేధింపులు, సంస్థాగత బెదిరింపులను ఎక్కువగా ఎదుర్కొంటున్నారన్నారు.మీడియా సిబ్బంది తమ విధులను నిర్భయంగా నిర్వర్తించేలా చూడటానికి, కేంద్ర ప్రభుత్వం పాత్రికేయులను, మీడియా సిబ్బందిని, వార్తా సంస్థలను హింస, అనుచిత అణచివేత నుండి కాపాడే ఒక పటిష్టమైన, స్వతంత్ర జాతీయ చట్టాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు ఇళ్ళు, ఇళ్లస్థలాల సమస్య పరిష్కరించడంతోపాటు ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చి క్యాష్ లెస్ ట్రీట్మెంట్ అందించాలని, జర్నలిస్టులపై నిత్యం జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తగిన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డీ.జి. శ్రీనివాస్ శర్మ, ఐజేయూ సభ్యులు శ్రీనివాస్ మిన్పూర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు బొందుగుల నాగరాజు, ప్రెస్ క్లబ్ కోశాధికారి అశోక్, గౌరవ అధ్యక్షులు ఫారూక్ హుస్సేన్, శ్రీధర్, హరినాథ్, కామాటి కృష్ణ, సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ బాధ్యులు సత్యనారాయణ,రమేష్ గౌడ్, నగేష్, శివ చరణ్, రాము పటేరి, ప్రకాష్, రామ కృష్ణ గౌడ్, కృష్ణ గౌడ్, రాజశేఖర్, బోనగిరి చంద్రశేఖర్, గోవర్ధన్ రెడ్డి, చింతల రమేష్, ఖయ్యుం, యూసుఫ్ అలీ, సఫ్దర్, హమీద్, నరేందర్,తదితర జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

# ఆటోలకు మిర్రర్లు తప్పనిసరి..

- మిర్రర్లు లేకుంటే ప్రమాద ముప్పు..
- వెనుక రాకపోకలు కనిపించేలా ఏర్పాటు..
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు.. మందమర్రి పోలీసులు హెచ్చరిక..



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 (సిరి న్యూస్)** రహదారి భద్రతలో వాహనాల వెనుక వైపు నుంచి వచ్చే రాకపోకలను గమనించడం ఎంతో కీలకం. ముఖ్యంగా ఆటోలకు ఇరువైపులా ఏర్పాటు చేసే సైడ్ మిర్రర్లు ప్రమాదాల నివారణలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో మందమర్రి పట్టణ పరిధిలో ఆటో డ్రైవర్లు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మందమర్రి ఎస్సై జి. నరేష్ సూచించారు. ఆటోలకు అమర్చిన సైడ్ మిర్రర్లను లోపలికి మడిచి ఉంచడం, సరిగ్గా అమర్చకపోవడం వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలు డ్రైవర్‌కు కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు. మిర్రర్లను బయటివైపు, వెనుక నుంచి వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించేలా సరిగా అమర్చుకోవాలని సూచించారు. మలుపులు తిరిగే సమయంలో, ఇతర వాహనాలను దాటే సమయంలో వెనుక రాకపోకలను గమనించేందుకు మిర్రర్లు ఎంతో ఉపయోగపడతాయని ఎస్సై నరేష్ తెలిపారు. ఆటో డ్రైవర్లు తమ వాహనాల భద్రతా పరికరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. ప్రయాణికుల భద్రతతో పాటు ఇతర వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారి నిబంధనలు పాటించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ మిర్రర్లు లేకుండా లేదా సరిగ్గా ఏర్పాటు చేయకుండా ఆటోలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మందమర్రి ఎస్సై జి. నరేష్ హెచ్చరించారు.

# గాంధీజీ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకం

- సత్యం,అహింసా మార్గాలను అనుసరించాలి.
- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి.



**మెదక్ అక్టోబర్,02(సిరి న్యూస్)** సత్యం,అహింసా సిద్ధాంతాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన జాతిపిత మహాత్మా గాంధీజీ ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మెదక్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆకిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ..అహింస, సత్యాగ్రహ మార్గంలో మహాత్మా గాంధీజీ సాగించిన పోరాటం ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఎలాంటి హింసకు తావులేకుండా సత్యం, అహింసా సిద్ధాంతాలతో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించిన గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.గాంధీజీ చూపిన మార్గాన్ని నేటి తరం ఆచరించడం ద్వారా సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యత మరింత బలోపేతమవుతాయని అన్నారు. గాంధీజీ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు బట్టి. ఉదయ్ కుమార్, జుబెర్ అహ్మద్,మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు భీమరి. కిషోర్,ఆర్కే శ్రీనివాస్,రబ్బిన్ .దివాకర్,మాయ మల్లేశం,నాయకులు లింగారెడ్డి,గడ్డమీద కృష్ణ గౌడ్, ప్రభురెడ్డి,మోచి కిషన్, పెరిక. కిషన్,ఇందాద్, ఇస్మాయిల్, అరుణ్‌కుమార్, వెంకటేశం, సాయి,యాదగిరి, రవి, రంజిత్ నాయక్, తరుణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం



**సదాశివపేట అక్టోబర్ 2. (సిరిన్యూస్)** సదాశివపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి, పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు ఓదెల ప్రభు గుప్తా మాట్లాడుతూ, మహిళలను ఆర్థికంగా పరిపుష్టి చేయడమే తమ క్లబ్ ముఖ్య లక్ష్యమని, అందుకోసం అవసరమైన పూర్తి చేయూతను అందిస్తామని ప్రకటించారు. క్లబ్ పట్టణ కార్యదర్శి మఠం రాచన్న స్వామి మాట్లాడుతూ ఒక దేశం అభివృద్ధి పథంలో నడవాలంటే కుటుంబ ప్రగతి ఎంతో ముఖ్యమని, ఆ కుటుంబ వ్యవస్థకు మూలస్తంభమైన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే కుటుంబాలు బాగుపడతాయని తెలిపారు. అందుకోసమే రోటరీ క్లబ్ నిరంతరం సహాయ సహకారాలు అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్థికంగా వెనుకబడి, మహిళలపైనే ఆధారపడిన కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అలాగే, రజక వృత్తిని నమ్ముకుని పాతకాలపు ఇస్త్రీ పెట్టెలను వాడుతున్న మహిళలకు ఉపాధి సులభతరం చేసేందుకు నూతన టెక్నాలజీతో కూడిన నయా ఐరన్ బాక్సులను అందజేశారు. ఇదే వేదికపై రోటరీ క్లబ్ సభ్యురాలు గడీల అన్నపూర్ణ గారు ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్న సందర్భంగా క్లబ్ సభ్యులందరూ ఆమెను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సదాశివపేట కోశాధికారి వేణుగోపాల్ ముంద్రా, అధ్యక్షులు వినోద్ కుమార్, క్లబ్ డైరెక్టర్లు మాశెట్టి ప్రవీణ్, పురం రజిని, గడిలా అన్నపూర్ణ, బలరాం రాజు, తంగడపల్లి లక్ష్మణ్, ఎస్. బి. శరత్ చంద్ర, బచ్చు సత్యనారాయణ, ఎస్. మధుసూదన్ చారి, గొల్ల రామచందర్, శిశు మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంగమేశ్వర్, మహిళా లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయం



- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**మెదక్ అక్టోబర్,02(సిరి న్యూస్)** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ,దేశ స్వాతంత్ర్య కోసం మహాత్మా గాంధీ అహింస,సత్యాగ్రహ మార్గాలను అనుసరించి ప్రజలను ఏకతాటిపైకి తీసుకు వచ్చారని అన్నారు. సత్యం,అహింస,శాంతి,స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్ లో ఏవో యునాస్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి మహాత్మా గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు,కలెక్టరేట్ ఏఓ,సిబ్బంది ,తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

# ఆరూర్ గ్రామంలో ప్రత్యేక గ్రామసభ



**సదాశివపేట. అక్టోబర్ 2. (సిరిన్యూస్)** గ్రామాభివృద్ధిని ప్రజల భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లేందుకు విబి గ్రామ్ జి కార్యక్రమంలో భాగంగా ఆరూర్ గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నాయికోటి లావణ్య మధు మాట్లాడుతూ ప్రజల అవసరాలు, ప్రాధాన్యతల ఆధారంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడతామని తెలిపారు. పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన ఆరూర్ గ్రామ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి మల్లేశం గౌడ్ మాట్లాడుతూ విబి గ్రామ్ జి కింద అందుబాటులో ఉన్న పథకాలను వినియోగించుకుని గ్రామ పటాన్ని రూపొందించి, అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని వివరించారు. పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ, వ్యర్థాల నిర్వహణ, రహదారులు, ప్రజా సౌకర్యాలు, ఉపాధి, మౌలిక వసతులపై ప్రజల సూచనలు తీసుకున్నారు. ఈ గ్రామసభలో ఉపసర్పంచ్ విఠల్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు భరత్, ఎం. నాగేష్, భాగ్యలక్ష్మిరవి, అంజయ్య, రమేష్, భారతమ్మ, నాగేష్, పద్మలక్ష్మణ్ గౌడ్, లక్ష్మిరాములు, మాజీ సర్పంచ్ మధు, మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీలు కుమార్, లలిత తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి వేడుకలు




**సదాశివపేట. అక్టోబర్ 2. (సిరిన్యూస్)** సదాశివపేటలోని ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ దేశానికి ఎన్నో సేవలు చేశారని ఆయన జీవితాన్ని దేశానికి అర్పితం చేశాడన్నారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు కోడూరి అంజయ్య, అధ్యక్షులు మా శెట్టి ప్రకాశం, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కంది కృష్ణ, సెక్రటరీ పురం సుధాకర్, యువజన సంఘం అధ్యక్షులు దిడిగే నాగేష్, వాసవి క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్, ఆలయ కమిటీ సెక్రటరీ శంకర్ బిక్షపతి, కొత్త రమేష్, దిడ్డిగే వినోద్, రవీందర్, రామకృష్ణ, చంద్రయ్య , కోడూరి శరత్చంద్ర పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ బాటలో నడుద్దాం..




**వెల్దుర్తి, అక్టోబర్ 02, (సిరి న్యూస్):** జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస మార్గమే సమాజానికి స్ఫూర్తిదాయకమని రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్ యాదవ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సత్యం-అహింస సిద్ధాంతాలను జీవితంలో పాటించాలని పిలుపునిచ్చారు. ఆయన చూపిన మార్గం నేటి తరానికి కూడా ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**మేడ్చల్ అక్టోబర్ 2 (సిరి న్యూస్ )**

మేడ్చల్: మేడ్చల్‌లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ జీహెచ్‌ఎంసీ బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విష్ణు చారి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ యాదవ్, నవీన్ రెడ్డి, శైలేందర్, నాగరాజు, సంతోష్, విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొని గాంధీజీ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ చూపిన అహింస, సత్యం, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. మేడ్చల్‌లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన సందర్భంగా స్థానికులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి

- **ఎఫ్‌సీఐ గోదాముల సమీపంలో ఆర్టీసీ బస్సు,బుల్లెట్ ఢీ.**




**మెదక్ అక్టోబర్,02(సిరి న్యూస్)**

మెదక్ జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదాముల సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెదక్ పట్టణం గాంధీనగర్‌కు చెందిన సద్దాం హుస్సేన్ అనే ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందారు.ఆయన వ్యవసాయ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రామాయంపేట నుంచి మెదక్ వైపు వస్తున్న సిద్దిపేటకు చెందిన ఆర్టీసీ బస్సు TS 36 T 0251 ఎఫ్‌సీఐ గోదాముల వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌పై వస్తున్న సద్దాం హుస్సేన్ వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడి మృతి చెందారు. సమాచారం అందుకున్న మెదక్ పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# సత్యం.. అహింస.. గాంధీ మార్గం




- **పటాన్‌చెరు నియోజకవర్గంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు**

**రామచంద్రాపురం, అక్టోబర్ 2 (సిరి న్యూస్):**

జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి పాల్గొని గాంధీజీకి ఘన నివాళులర్పించారు. మాక్ సొసైటీలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామచంద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్‌రెడ్డితో కలిసి గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ రహదారి విస్తరణలో తొలగించిన గాంధీ విగ్రహాన్ని పాఠశాల ఆవరణలో పునఃప్రతిష్ఠించి ఆవిష్కరించారు. సండే మార్కెట్‌లోనూ గాంధీజీకి నివాళులర్పించారు. ఎల్ఐజి బస్‌స్టాప్ వద్ద మైనారిటీ నాయకులు అజీముద్దీన్, మునీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, పరమేష్‌యాదవ్, బూన్, ఐలేష్‌యాదవ్ పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యం తోనే గ్రామాభివృద్ధి



- **సర్పంచ్ శ్రావణి నిరంజన్**

**రాయికోడ్, అక్టోబర్ 02(సిరి న్యూస్):**

గ్రామ ప్రజల సహకారంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని సింగితం గ్రామ సర్పంచ్ శ్రావణి నిరంజన్ అన్నారు. శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా సింగీతంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రావణి నిరంజన్ మాట్లాడుతూ వీబి జి రామ్ జి పథకంలో భాగంగా గ్రామ చిత్రపటాన్ని రూపొందించి, గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రజలతో చర్చించారు. ప్రజల సూచనలు, అవసరాల ఆధారంగా ప్రాధాన్యత కలిగిన అభివృద్ధి పనులపై గ్రామసభలో తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి





- **టియుడబ్ల్యూజే ( ఐజేయు) ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అధ్యక్షుడు**
- **కూన్ రెడ్డి బాలకోటి రెడ్డి**
- **నల్లబ్యాడ్జిలు ధరించి ర్యాలీ నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేత**

**నిడమనూరు, అక్టోబర్ 2, సిరి న్యూస్:**

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని టి యు డబ్ల్యూజే ( ఐజేయు) అనుబంధ ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు కూన్ రెడ్డి బాలకోటి రెడ్డి శుక్రవారం కోరారు. ఐజేయు పిలుపుమేరకు పాత తాలూకా నిడమానూరులో టియూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు ఇంటి స్థలాలతో పాటు ఇల్లు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే హెల్త్ కార్డులు అందించి జర్నలిస్టులకు క్యాష్ లెస్ ట్రీట్మెంట్ అందించాలని కోరారు. ఐజేయూ ప్రధాన డిమాండ్లు నూతన కమీషన్ ఏర్పాటు చేయాలి, పాత్రికేయుల భద్రత కోసం జాతీయ స్థాయిలో చట్టం తేవాలి, రద్దు చేయబడ్డ జర్నలిస్ట్ చట్టాలను పునరుద్ధరణ చేయాలి, నూతన వేతన మండలి ఏర్పాటు చేయాలని, అర్హులైన జర్నలిస్ట్ లకు ఇండ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, హెల్త్ కార్డులు ఇచ్చి క్యాష్ లెస్ ట్రీట్మెంట్ అందేలా చూడాలని వినతి పత్రంలో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బత్తుల సూరయ్య, ఉపాధ్యక్షుడు ఉమ్మడి వేంకట రెడ్డి, కోశాధికారి జువ్వి రాజు, జిల్లా ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి చీదల్ల నరహరి, అన్నెబోయిన కొండల్, కవి గాయకుడు, యూట్యూబర్ కంచి శ్రీనివాస్, బొజ్జ రవి, కంచర్ల రవీందర్ రెడ్డి, జారిపోతుల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత






- **ఉస్మాన్‌నగర్ బీ-మ్యాక్ సొసైటీలో సీసీ రోడ్డు, రక్షిత మంచినీటి సరఫరా ప్రారంభం**
- **- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**రామచంద్రాపురం, అక్టోబర్ 2 (సిరి న్యూస్):**

ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ డివిజన్ ఉస్మాన్‌నగర్ బీమ్యాక్ సొసైటీ కాలనీలో మాజీ కౌన్సిలర్ చిట్టి ఉమేష్ సొంత నిధులతో చేపట్టిన నూతన సీసీ రోడ్డు, ఇంటింటికీ రక్షిత మంచినీటి సరఫరాను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లోని మౌలిక వసతుల సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధికి సొంత నిధులతో సహకరించిన చిట్టి ఉమేష్‌ను అభినందించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రక్షిత మంచినీటి సరఫరాకు సహకరించిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సోమిరెడ్డి, రాములుగౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రపంచానికి ఆదర్శప్రాయుడు జాతిపిత మహాత్మా గాంధీ

- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **పటాన్ చెరు లో ఘనంగా గాంధీ మహాత్ముడి జయంతి వేడుకలు**



**పటాన్ చెరు, అక్టోబర్ 2, (సిరి న్యూస్):**

ప్రపంచానికి ఆదర్శప్రాయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ జయంతి ని పురస్కరించుకొని పటాన్ చెరు పట్టణంలోని గాంధీ థీమ్ పార్క్ లో గల మహాత్మా గాంధీ కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే జిఎంఆర్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస పద్ధతుల ద్వారా దేశానికి స్వతంత్రం తీసుకు వచ్చిన మహోన్నత నాయకుడు మాత్మ గాంధీ అని కొనియాడారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని అన్నారు. నేటి తరాలకు మహాత్మా గాంధీ చరితను తెలియజేసే విధంగా ప్రతి గ్రామపంచాయతీ ఆవరణలో విగ్రహాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన కూడళ్లలో సైతం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, హమీద్, నాయకులు, పట్టణ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి కృషి

- **సర్పంచ్ మహబూబ్ పటేల్**




**రాయికోడ్, అక్టోబర్ 02(సిరిన్యూస్):**

మౌలిక వసతులు కల్పిస్తూ గ్రామాభివృద్దె లక్ష్యంగా కృషి చేస్తానని మామిడిపల్లి గ్రామ సర్పంచ్ మహబూబ్ పటేల్ అన్నారు. శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా మామిడిపల్లి గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మహబూబ్ పటేల్ మాట్లాడుతూ వీబి జి రామ్ జి పథకంలో భాగంగా గ్రామ చిత్రపటాన్ని రూపొందించి, గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రజలతో చర్చించారు. ప్రజల సూచనలు, అవసరాల ఆధారంగా ప్రాధాన్యత కలిగిన అభివృద్ధి పనులపై గ్రామసభలో తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య

**నర్సాపూర్ అక్టోబర్ 2( సిరి న్యూస్)**



చెరువులో దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి చెందిన ప్రదీప్(30) గత నెల 29వ తేదీన తనకు ఆరోగ్యం బాగాలేదని ఇంట్లో నుంచి బయటకు వెళ్ళాడు. చీకటి పడుతున్న ఇంటికి రాకపోవడంతో తన ఫోన్‌కి కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మరుసటి రోజు మధ్యాహ్నం సమయంలో తన తమ్ముడు ఫోన్‌కి "మిస్ యూ చింటూ స్వారీ రా.." అంటూ వాట్సాప్‌లో మెసేజ్ చేసి లొకేషన్ పెట్టడం జరిగింది. లొకేషన్ ఆధారంగా నర్సాపూర్ రాయారావు చెరువు వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులు వెతకగా ప్రదీప్ ఆచూకీ లభించలేదు. శుక్రవారం చెరువులో ఓ మృతదేహం పడి ఉందని పోలీసులకు గుర్తు తెలియని వ్యక్తి సమాచారం అందించారు ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులతో కలిసి వెళ్లి చూడగా మృతదేహము ప్రదీప్‌గా గుర్తించారు. తన కుమారుడు అనారోగ్యం బాగా లేకనే కడుపు నొప్పితో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నాడని, గతంలో కూడా ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి తనంతట తాను వచ్చాడని, అతని మరణం పట్ల ఎలాంటి అనుమానం లేదని తండ్రి దాడిగే నర్సింలు ఫిర్యాదులో పేర్కొన్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు

# గీతం హైదరాబాదులో ఘనంగా గాంధీ జయంతి



**పటాన్ చెరు, అక్టోబర్ 2, (సిరి న్యూస్):**

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని, ఆయన శాశ్వత ఆదర్శాలైన సత్యం, అహింస, నిరాడంబరత, స్వదేశీలకు ఘన నివాళులర్పించింది. భారత స్వాతంత్ర్య పోరాటానికి గాంధీజీ చేసిన విశేష కృషిని, ఆయన విశ్వవ్యాప్త శాంతి, అహింసా సందేశాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన కాలాతీత సూత్రాలు సత్యం, కరుణ, సామాజిక బాధ్యత, శాంతియుత సహజీవనాన్ని నిలబెట్టడానికి వ్యక్తులను, సమాజాలను ప్రేరేపిస్తూనే ఉన్నాయి. ఈ నివాళులర్పించే కార్యక్రమంలో గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ డాక్టర్ బందన్ కుమార్ మిశ్రా, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ ఇన్ ఛార్జి డాక్టర్ శామ్యూల్ ధరు, బాబా అణు పరిశోధనా సంస్థ పూర్వ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి.ఎ. రామారావు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. వారు మహాత్మాకు నివాళులర్పించి, నేటి ప్రపంచంలో ఆయన ఆదర్శాల ఔచిత్యాన్ని స్మరించుకున్నారు.

# శాంతి మార్గంలో దేశ స్వాతంత్రం సాధించిన మహనీయుడు గాంధీజీ

- **మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు.**

**మెదక్ అక్టోబర్,02(సిరి న్యూస్)**

శాంతి మార్గంలో దేశ స్వాతంత్రాన్ని సాధించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్ ఆధ్వర్యంలో పట్టణంలో ని రాందాస్ చౌరస్తాలో గల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్,పట్టణ పార్టీ అధ్యక్షులు గంగాధర్ లు మాట్లాడుతూ.శాంతి మార్గంతో దేశ స్వాతంత్రన్ని సాధించిన గొప్ప మహనీయుడు మహాత్మా గాంధీ అని అన్నారు.



గాంధీ చూపిన సత్యం,అహింస, శాంతి మార్గాలు నేటికి సమాజానికి మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు.దేశ స్వాతంత్ర పోరాటంలో ఉప్పు సత్యాగ్రహం శాంతియుత పోరాటాలతో దేశ స్వాతంత్రానికి మార్గం చూపిన మహనీయుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు.గాంధీ ఆశయాలను దేశ యువత ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, మున్సిపల్ కౌన్సిలర్లు అవారి రాజశేఖర్, తొడుపునూరి శివరామకృష్ణ,గౌస్ కురేష్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణరెడ్డి మృతిపై కుటుంబ సభ్యుల అనుమానాలు







- **'ఆత్మహత్య చేసుకునే వ్యక్తి కాదు' అంటున్న కుమారుడు, బంధువులు**

**సంగారెడ్డి, అక్టోబర్ 2, (సిరి న్యూస్:):**

వెల్డింగ్, ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న కొత్తగాడి నారాయణరెడ్డి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయనది ఆత్మహత్య కాదని, ఆత్మహత్య చేసుకునే స్వభావం ఆయనకు లేదని కుమారుడు నవీన్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు చెబుతున్నారు. సుమారు 50 ఏళ్ల వయసున్న నారాయణరెడ్డి కుటుంబం వికారాబాద్ జిల్లా తాండూర్ ప్రాంతం నుంచి దాదాపు 40 సంవత్సరాల క్రితం జీవనోపాధి కోసం వలస వచ్చినట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. స్థానికంగా పరిశ్రమల్లో పనిచేసిన నారాయణరెడ్డి వెల్డింగ్ పని నేర్చుకుని, అనంతరం ఫ్యాబ్రికేషన్ వృత్తిని చేపట్టి కుటుంబాన్ని పోషిస్తున్నట్లు సమాచారం. నారాయణ రెడ్డి వివిధ వ్యక్తులతో కలిసి ఫ్యాబ్రికేషన్ పనులు చేసినట్లు చెబుతున్నారు. అయితే ఆయనకు ఎవరితోనైనా వివాదాలు ఉన్నాయా? మృతికి ముందు ఏమైనా పరిణామాలు చోటు చేసుకున్నాయా? అనే విషయాలపై స్పష్టత లేదని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. మృత దేహం లభించిన ప్రాంతంలో పురుగుల మందు డబ్బా కనిపించడం, మృతదేహం ఉన్న పరిస్థితిని పరిశీలించిన అనంతరం తమకు పలు అనుమానాలు కలుగుతున్నాయని మృతుని కుమారుడు నవీన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, బంధువులు చెబుతున్నారు. నారాయణరెడ్డి ఆత్మహత్య చేసుకునే వ్యక్తి కాదని వారు పేర్కొంటూ, ఆయన మృతికి గల కారణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని కోరుతున్నారు. అయితే నారాయణరెడ్డి మృతికి ఖచ్చితమైన కారణం ఏమిటన్నది అధికారిక దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# భిక్య తండాను ఆదర్శ గ్రామపంచాయతీగా మారుస్తాం...

- **సర్పంచ్ నేనావత్ విజయ నాయక్...**

**శివంపేట అక్టోబర్ 2 (సిరి న్యూస్ ):**

శివంపేట్ మండల కేంద్రంలోని బిక్యా తండా గ్రామపంచాయతీలో ఈరోజు పరిశుభ్రత ఆరోగ్యవంతంగా తీర్చడమే లక్ష్యంగా తడి పొడి చెత్త బుట్టలు అలాగే కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా సర్పంచ్ విజయ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్త వేరువేరుగా సేకరించడం వలన మన గ్రామంలో పరిశుద్ధం పరిశుభ్రత వెలుగు పడుతుందన్నారు ప్రజలందరూ గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించి చెత్తను రోడ్డుపై వేయకుండా బుట్టలోనే వేయాలని కోరారు. అదేవిధంగా అర్హత కలిగిన వారికి కొత్త



రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది.కొత్త కార్డు రాని కుటుంబాలను గుర్తించి కార్డు అందజేస్తామని త్వరలోనే అందేలా చూస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామపంచాయతీ సెక్రటరీ మహమ్మద్ అలీ, ఉప సర్పంచ్ దేవరాజ్, వార్డ్ మెంబర్ రమేష్, శ్రీనివాస్ చౌహాన్, మాధురి కిస్టు నాయక్,ఫుల్ సింగ్ నాయక్, వనిత,దుర్గా,1 నాయక్,శారద, గోపాల్ నాయక్, రాధా,మాన్సింగ్ నాయక్,మాజీ వార్డ్ మెంబర్ సుశీల,సురేష్ నాయక్,కిషన్ నాయక్,మోహన్ నాయక్,పింకు నాయక్,రాజు నాయక్,రుప్ల నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

# ఘనంగా గాంధీజీ జయంతి వేడుకలు!!

**శివంపేట అక్టోబర్ 2 (సిరి న్యూస్ )**

శివంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద మహాత్మా గాంధీజీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, గాంధీజీ దేశానికి అందించిన సేవలను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను ఈ సందర్భంగా నాయకులు, ప్రజలు గుర్తుచేసుకున్నారు, గ్రామంలోని మహాత్మా గాంధీజీ విగ్రహాని కి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా మండలం లోని గ్రామ సర్పంచ్లు మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు, గాంధీజీ ఆశయాలు నేటి సమాజానికి కూడా ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని అన్నారు, గ్రామాల అభివృద్ధితో పాటు పరిశుభ్రత, సామాజిక బాధ్యత, పరస్పర సహకారం, శాంతియుత జీవనం వంటి విలువలను ప్రజలు అలవర్చుకోవాలని సూచించారు, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పేర్కొన్నారు, స్వచ్ఛతకు ప్రాధాన్యతనిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు, గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను స్మరించుకోవడంతో పాటు వాటిని ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని తెలిపారు, అనంతరం మండలంలోని అన్ని గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, యువకులు గాంధీజీకి నివాళులర్పించారు, గాంధీజీ దేశ ప్రజలకు సత్యం, అహింస, శాంతి మార్గాలను చూపించారని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు, జాతిపిత మహాత్మా గాంధీజీ ఆశయాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు, యువత గాంధీజీ



సిద్ధాంతాలను తెలుసుకుని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు, గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు, గాంధీజీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో కూడా ప్రజా ప్రతినిధులు, గ్రామపంచాయతీ పాలకవర్గాలు, అధికారులు, గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మహాత్మా గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు, గ్రామాల్లో శాంతి, సౌభ్రాతృత్వం, పరిశుభ్రత, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా పలువురు పిలుపునిచ్చారు, గాంధీజీ చూపిన మార్గం సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటుందని, ఆయన ఆశయాలను ఆచరించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్లు ,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు

- **జిల్లా అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బండారి గంగాధర్!!**

**శివంపేట అక్టోబర్ 2 (సిరి న్యూస్ )**

శివంపేట మండల కేంద్రంలోని పిల్లుట్ల గ్రామంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బండారి గంగాధర్ పాల్గొని మహాత్మా గాంధీ సేవలను స్మరించుకున్నారు, ఈ సందర్భంగా బండారి గంగాధర్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు, సత్యాగ్రహం, అహింస మార్గాలను ఆయుధాలుగా చేసుకుని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి కోట్లాది మంది భారతీయుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు, గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సామరస్య మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆదర్శప్రాయమని తెలిపారు, దేశ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు, గాంధీజీ ఆలోచనలు, సిద్ధాంతాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు, ఆయన చూపిన అహింసా మార్గంలో నడుస్తూ సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యతను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు, గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవడంతో పాటు ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు, గ్రామీణ ప్రాంతాల్లో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం, స్వచ్ఛత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు, యువత గాంధీజీ జీవిత చరిత్రను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్రను తెలుసుకుని దేశ అభివృద్ధిలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు, అనంతరం మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు, ఈ కార్యక్రమంలో బిజిఆర్ యువసేన అధ్యక్షుడు కుమ్మరి నాగరాజు, బండారి నాగేష్, బండారి ముత్యాలు, 10వ వార్డు సభ్యుడు కమల్ కిషోర్, 1వ వార్డు సభ్యురాలు గాండ్ల లత ఆంజనేయులు, పిల్లి చంద్ర య్య, కొత్తపల్లి నాగరాజు, గాండ్ల దాసు, పిల్లి సురేష్, రంగప్ప బాలరాజు, పిల్లి మధు, పిల్లి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



# బీహెచ్ఈఎల్‌లో ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి



**రామచంద్రపురం, అక్టోబర్ 2 (సిరి న్యూస్)**

బీహెచ్ఈఎల్ రామచంద్రాపురం యూనిట్‌లో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌పీఈపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. సుబ్రహ్మణ్యంతో పాటు జీఎంలు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛతా హి సేవా, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని గాంధీ విగ్రహం నుంచి నెహ్రూ ఉద్యాన్ పార్క్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మహనీయుల ఆశయాలతో 'పరిశుభ్రమైన భారత్-అభివృద్ధి చెందిన భారత్' నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని బీహెచ్ఈఎల్ ప్రతినిధులు తెలిపారు.

# పోలీస్ స్టేషన్ల పరిధుల్లో మార్పులు

- **బీహెచ్ఈఎల్ న్యూ ఎంఐజీ–2 రామచంద్రాపురం పీఎస్‌కు..**
- **ఈదుల నాగులపల్లి కొల్లూరు పీఎస్‌కు**

**రామచంద్రాపురం, అక్టోబర్ 2 (సిరి న్యూస్):**

పోలీస్ స్టేషన్ల ప్రాదేశిక పరిధుల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 85 ప్రకారం పలు ప్రాంతాలను కొత్త పోలీస్ స్టేషన్ల పరిధిలోకి మార్చారు. ఈ మార్పులు అక్టోబర్ 2 నుంచి అమల్లోకి వచ్చాయి. బీహెచ్ఈఎల్ న్యూ ఎంఐజీ ఫేజ్-2 (విద్యుత్‌నగర్ కాలనీ)ను కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధి నుంచి రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోకి చేర్చారు. ఈదుల నాగులపల్లి గ్రామాన్ని బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ పరిధి నుంచి కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చారు. ఇకపై ఈదుల నాగులపల్లి ప్రజలు పోలీస్ సేవలు, ఫిర్యాదులు, ఇతర సహాయం కోసం కొల్లూరు పోలీస్ స్టేషన్‌ను, బీహెచ్ఈఎల్ న్యూ ఎంఐజీ ఫేజ్-2 ప్రజలు రామచంద్రాపురం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు. పరిధుల మార్పును ప్రజలు గమనించాలని కోరారు.

**కొల్లూరు పీఎస్: 8712663376**

**కొల్లూరు ఎస్‌హెచ్‌ఓ: 8712663370**

**రామచంద్రాపురం పీఎస్: 8712663199**

**రామచంద్రాపురం ఎస్‌హెచ్‌ఓ: 8712663190**

# మారిన పోలీస్ స్టేషన్ల పరిధులు

- **11 గ్రామాలు ఇస్నాపూర్ పీఎస్‌కు.. 7 గ్రామాలు, 5 కాలనీలు పటాన్‌చెరు పీఎస్‌కు**

**పటాన్‌చెరు, అక్టోబర్ 2 (సిరి న్యూస్):**

పోలీస్ స్టేషన్ల ప్రాదేశిక పరిధుల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రభుత్వం జారీ చేసిన జీఓఎంఎస్ నంబర్లు 85, 88 ప్రకారం పలు గ్రామాలు, కాలనీలను కొత్తగా సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలోకి చేర్చారు. ఈ మార్పులు అక్టోబర్ 2 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇస్నాపూర్, చిట్కుల్, చిన్న కంజర్ల, ఇంద్రేశం, లకారం, పెద్ద కంజర్ల, రుద్రారం, రామేశ్వరం బండ, బచ్చుగూడెం, ఇనోల్, ములుగోయి గ్రామాలు ఇకపై ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటాయి. ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీల పరిధిలోని ఈ గ్రామాల ప్రజలకు ఇస్నాపూర్ పీఎస్ ద్వారా పోలీసు సేవలు అందనున్నాయి. సీఎంసీ పరిధిలోని ముత్తంగి వార్డుకు చెందిన ఘన్‌పూర్, వెనుముకుంట, కర్దనూర్, పాటి, వెలిమెల, వెలిమెల తండా, సందుగూడెం గ్రామాలు గతంలో బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండగా, ఇకపై పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చాయి. అలాగే ఆర్‌సీ పురం పీఎస్ పరిధిలో ఉన్న బండ్లగూడ, మార్క్స్ నగర్, భోపాల్ రెడ్డి నగర్, నేతాజీ నగర్, బాలాజీ నగర్ కాలనీలను కూడా పటాన్‌చెరు పీఎస్ పరిధిలోకి మార్చారు. అక్టోబర్ 2 నుంచి ఆయా గ్రామాలు, కాలనీల్లో శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు, పెట్రోలింగ్, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు తదితర పోలీసు సేవలను సంబంధిత పోలీస్ స్టేషన్లు నిర్వహిస్తాయని పటాన్‌చెరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం. రవీందర్ తెలిపారు. రు. ప్రజలు తమ పోలీసు సంబంధిత అవసరాల కోసం ఇకపై కొత్తగా కేటాయించిన పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

# ఆదర్శ గ్రామంలో ప్రత్యేక గ్రామ సభ



**తూప్రాన్ అక్టోబర్ 2 సిరి న్యూస్**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో బి బి జి రాంజీ పథకంపై శుక్రవారం సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ ఆవరణలో సోషల్ మ్యాప్ రిసోర్స్ మ్యాపులను వేసి పనులపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి సంరక్షణకు సంబంధించిన పనులపై గ్రామ సభలో చర్చించి పనులను ఆమోదించారు. ఇంకుడు గుంతలు పంట కుంట, బోర్ల రీఛార్జ్, కందకాలు కుంటల పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శాలిక సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ఏపీఓ సంతోష్ రెడ్డిలు గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మహేశ్వరి ఉప సర్పంచ్ స్వామి పాలకవర్గ సభ్యులు పిట్ల వేణు ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు అంగన్వాడి టీచర్లు లావణ్య స్వర్ణలత వివో ఏ సంతోష ఆశవర్కర్ ఇందిరా మహిళలు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కారమయ్యే వరకు జర్నలిస్టుల పోరాటం



- టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.జి. శ్రీనివాస శర్మ,
- బసన్నపల్లి మల్లేశం
- డిమాండ్ డే, నిరసనకు మెదక్ తరలివెళ్లిన రామాయంపేట జర్నలిస్టులు

**రామాయంపేట, అక్టోబర్ 2 (సిరి న్యూస్)**

జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి. శ్రీనివాస శర్మ, రామాయంపేట ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు బసన్నపల్లి మల్లేశం అన్నారు. ఐజేయూ పిలుపు మేరకు గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన డిమాండ్ల దినోత్సవ నిరసన కార్యక్రమానికి రామాయంపేట జర్నలిస్టులు మెదక్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు, మీడియా సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, జర్నలిస్టుల చట్టబద్ధ హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నూతన వేజ్‌బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు పాతూరి రమేష్‌గౌడ్, పటేరి రాము, తుజాల శ్రీనివాస్‌గౌడ్, బొంతల సత్యనారాయణ, తుడుం పెంటయ్య, కర్రే నరేందర్, సభావత్ సర్దార్, గజ్జల రామచంద్రారెడ్డి, సార్గు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టీఐ కమిటీకి దరఖాస్తులు..

- ఇద్దరు కార్యకర్తలకు కమిటీలో అవకాశం..
- 6వ తేదీలోగా దరఖాస్తుల స్వీకరణ..
- కలెక్టర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా దరఖాస్తు..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 (సిరి న్యూస్)**

సమాచార హక్కు చట్టం-2005ను జిల్లాలో మరింత సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు, సమాచార హక్కు చట్టం అమలుపై జిల్లా స్థాయిలో సమన్వయం, పర్యవేక్షణ, అమలు ప్రక్రియను పటిష్టం చేసేందుకు జిల్లా స్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. కమిటీలో ఇద్దరు సమాచార హక్కు కార్యకర్తలను నామినేషన్, రోటేషన్ పద్ధతిలో సభ్యులుగా ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం మంచిర్యాల జిల్లాకు చెందిన ఆసక్తి, అర్హత కలిగిన సమాచార హక్కు కార్యకర్తల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన కార్యకర్తలు తమ దరఖాస్తులను ప్రజా సమాచార అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా కలెక్టర్ కార్యాలయం, మంచిర్యాల వద్ద ఈ నెల 6వ తేదీలోగా వ్యక్తిగతంగా సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా ఇద్దరు సమాచార హక్కు కార్యకర్తలను కమిటీ సభ్యులుగా నామినేట్ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని సమాచార హక్కు కార్యకర్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

# జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు ఇవ్వాలి




- సంగారెడ్డిలో TUWJ H-143 ఆధ్వర్యంలో 'ఉత్తరాల ఉద్యమం'
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్టు కార్డుల ద్వారా జర్నలిస్టుల నిరసన
- అక్రిడిటేషన్ ఉన్న ప్రతి జర్నలిస్టుకు ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్
- భారీ సంఖ్యలో తరలివచ్చిన జిల్లా జర్నలిస్టులు

**సంగారెడ్డి: అక్టోబర్ 2 (సిరి న్యూస్)**

అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులందరికీ ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు మంజూరు చేసి, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ H143) ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వినూత్నంగా 'ఉత్తరాల ఉద్యమం' నిర్వహించారు. TUWJ H143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్ పిలుపు మేరకు సంగారెడ్డి పట్టణంలోని గంజ్ మైదానంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తాము ఎదుర్కొంటున్న ఆరోగ్య, సంక్షేమ సమస్యలను పోస్టు కార్డులపై రాసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపించారు. అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుతో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా మెరుగైన వైద్య సేవలు అందేలా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి, కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ నగదు రహిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాజానికి నిరంతరం సమాచారాన్ని అందిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టుల ఆరోగ్యం, ప్రాణాలకు ప్రభుత్వం భద్రత కల్పించాల్సిన బాధ్యత ఉందని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. జర్నలిస్టుల న్యాయమైన ఆరోగ్య, సంక్షేమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహం నుంచి సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్ వరకు జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రికి రాసిన పోస్టు కార్డులను పోస్ట్ బాక్స్‌లో వేసి తమ నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీధర్, జిల్లా నాయకులు సీహెచ్ పరశురాం, కరుణాకర్ రెడ్డి, నగేష్, క్రాంతి, రాఘవరెడ్డి, ప్రదీప్, పవన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాల బాటలో గ్రామాభివృద్ధి

**మెదక్ అక్టోబర్ 2 సిరి న్యూస్**



జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకొని మెదక్ జిల్లా పాపన్నపేట మండలం అన్నారం గ్రామంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటాన్ని ఆయన పాటించిన సత్యం అహింసా సిద్ధాంతాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గ్రామ అభివృద్ధితో పాటు పరిశుభ్రత ప్రజల మధ్య ఐక్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు పిలుపునిచ్చారు. సర్పంచి గంట రాణి సుధీర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీజీ చూపిన మార్గం దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని అన్నారు. సత్యం అహింసను ఆయుధాలుగా చేసుకొని ప్రజలను ఏకం చేసిన గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే గ్రామంలోని ప్రతి ఒక్కరూ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అన్నారు. పంచాయతీ చేపట్టే కార్యక్రమాలకు ప్రజల సహకారం ఉంటే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఉపసర్పంచి జంగటి లింగం మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా ఉన్నాయని అన్నారు. గ్రామంలో ప్రజలంతా కలిసిమెలిసి ఉంటూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామ ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి దుర్గ భవాని మాట్లాడుతూ గాంధీజీ పరిశుభ్రతకు ఇచ్చిన ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. పరిశుభ్రమైన గ్రామం కోసం పంచాయతీతో పాటు ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాలను, గ్రామ వీధులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. గ్రామ పంచాయతీ సభ్యులు మంజుల శివ్య నాయక్ మాట్లాడుతూ గాంధీజీ జీవితం సేవా భావానికి ప్రతీకగా నిలిచిందన్నారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను నేటి యువత తెలుసుకోవాలని అన్నారు. సత్యం, అహింస, క్రమశిక్షణను జీవితంలో భాగం చేసుకొని సమాజ అభివృద్ధిలో యువత ముందుండాలని సూచించారు. అన్నారం గ్రామ ప్రజలంతా ఐక్యంగా ఉండి గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని కోరారు. గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొని మహాత్మా గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు.

# ఘనంగా శ్రీ సరస్వతి దేవి పూజా హవన మహోత్సవం

- అక్టోబర్ 4న వైభవంగా పలు కార్యక్రమాలు.
- పూర్ణాహుతి.. భక్తులకు ధార్మికోపన్యాసం, అన్నప్రసాదం
- నిర్వాహకులు పబ్బ పెంటయ్య గుప్తా.
- పబ్బ చంద్రం గుప్తా

**రామాయంపేట, అక్టోబర్ 2 (సిరి న్యూస్)**





మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామర చెరువు గ్రామంలో శ్రీ సరస్వతి దేవి పూజా హవన మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అక్టోబర్ 4వ తేదీ ఆదివారం శ్రీ సరస్వతి దేవి పూజా హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. శ్రీ తిరుమల బాలాజీ రైస్ మిల్ ఇండస్ట్రీస్ అధినేత, యజ్ఞకర్త పబ్బ పెంటయ్య గుప్త ఆధ్వర్యంలో ఈ మహోత్సవం జరగనుంది. బ్రహ్మర్షి దైవరాత ఛందోదర్శన వేద మంత్రాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. జ్ఞానానికి ప్రతీకగా భావించే శ్రీ సరస్వతి దేవి అనుగ్రహం కోసం నిర్వహిస్తున్న ఈ యజ్ఞంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని లోకకల్యాణం, సర్వసిద్ధులు కలగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఆరోజు ఉదయం 7 గంటలకు గణపతి పూజ, స్వస్తివాచనం, కలశస్థాపనం, దేవీ చతుష్షష్టి ఉపచార పూజ, ఉపహారం, సువాసినీ పూజ వంటి కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఉదయం 10 గంటలకు సరస్వతి మంత్రహవనం, పూర్ణాహుతి నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు ధార్మికోపన్యాసం, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయి. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు భక్తులకు భోజన ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పబ్బ పెంటయ్య గుప్తా కోరారు పూజా కార్యక్రమాల్లో భాగంగా శ్రీ సరస్వతి స్తోత్ర కవచం, దేవ్యథర్వశీర్షోపనిషత్ పారాయణాలతో పాటు సమయానుకూలంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై శ్రీ సరస్వతి దేవి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. దామర చెరువులోని యజ్ఞస్థలానికి రామాయంపేట నుంచి కామారెడ్డి మార్గంలో సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో చేరుకోవచ్చని తెలిపారు. రామాయంపేట బస్‌స్టాండ్ నుంచి ఆటోల ద్వారా నేరుగా యజ్ఞస్థలానికి చేరుకునే సౌకర్యం కూడా ఉందని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9948537328, 9849682700 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# స్టేడియం స్వచ్ఛభారత్‌లో యువత భాగస్వామ్యం

- గాంధీ చూపిన మార్గం ఆచరణీయం.
- మెదక్ అథ్లెటిక్స్ స్టేడియంలో గాంధీ జయంతి సందర్బంగా స్వచ్ఛభారత్.
- మన పనులు మనమే చేసుకోవాలి..
- ఎవరో వస్తారు.. ఏమో చేస్తారని ఎదురు చూడొద్దు.. యువత.

**మెదక్ అక్టోబర్,02(సిరి న్యూస్)**



గాంధీ చూపిన మార్గం ఆచరణీయమని మెదక్ జిల్లా యువత నిరూపించారు. శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా మన పనులు మనమే చేసుకోవాలి అనే నినాదంతో మెదక్ వాకర్స్ ఆదర్శంగా నిలిచారు. దేశ భద్రత యువతతోనే సాధ్యమని పరిసరాల పరిశుభ్రతను పాటించాలని నడుంబిగించారు. స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు యువత ముందుండాలని పిలుపునిచ్చారు. మెదక్ అథెటిక్ స్టేడియం పరిసరాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేడియం పరిసరాల్లో వాకింగ్ ట్రాక్, రన్నింగ్ ట్రాక్ చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

**"మన పనులు మనమే చేసుకోవాలి.**

ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకూడదు" అనే సందేశంతో యువత స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొనడం అందరికీ ఆదర్శంగా నిలిచింది. సమాజంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి ముందుకు రావాలని నిర్వాహకులు సూచించారు. ప్రజా ప్రదేశాల్లో చెత్త వేయకుండా చూడడంతో పాటు, పరిసరాల పరిశుభ్రతను కాపాడేందుకు నిరంతరం కృషి చేయాలని యువతకు సూచించారు. స్వచ్ఛమైన సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని స్టేడియం మొత్తం వేపుగా పెరిగిన గడ్డి,పిచ్చి మొక్కలతో అంధకారంగా ఉండడంతో చలించిన యువత ముందుకొచ్చారు.తమ వంతు చందాలు వేసుకుని కలుపు మొక్కలను నివారించారు. దాదాపు రూ.75 వేల వ్యయంతో చందాలు వేసుకొని గడ్డి కటింగ్ చేసి స్టేడియం మొత్తం క్లీన్ అండ్ గ్రీన్ గా తీర్చిదిద్దారు.మెదక్ యువకులు,మార్నింగ్ వాకర్స్,అత్లెట్స్,సీనియర్ సిటిజన్స్, ఫుట్బాల్ క్రీడాకారులు ,సంయుక్తంగా కలిసి స్టేడియాన్ని సుందరీకరించారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్టేడియాన్ని సందర్శించి,కనీస మౌలిక సదుపాయాలు,లైటింగ్స్,ట్రాక్ చుట్టూ మొరం (మట్టి),త్రాగు నీరు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# బిజెపి కార్యాలయంలో రక్తదాన శిబిరం





- రైతులు వ్యవసాయంతో పాటు
- పాడి పరిశ్రమను రైతులకు ఆర్థిక వనరుగా మలచుకోవాలి
- ఎంపీ రఘునందన్ రావు

**నర్సాపూర్ అక్టోబర్ 2 (సిరి న్యూస్)**

భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నర్సాపూర్ నియోజకవర్గ బిజెపి పార్టీ కార్యాలయంలో రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్ రావు పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ చేపట్టి కార్యక్రమాలలో అందరూ భాగస్వాములు కావాలని రైతులు వ్యవసాయం పైనే ఆధారపడకుండా.. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను ఆదాయ వనరుగా మార్చుకోవాలి" అని పంటల సాగు కాలానుగుణంగా మారుతుంటే.పాడి పరిశ్రమ ద్వారా రైతు కుటుంబానికి నిరంతరంగా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని పశువులను పెంచుతూ పాల ఉత్పత్తి చేయడం ద్వారా వ్యవసాయానికి అనుబంధంగా మరో ఆదాయ మార్గాన్ని రైతులు ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు రైతులు పాలను ఉత్పత్తి చేస్తున్నప్పటికీ సరైన మార్కెట్, పాల సేకరణ కేంద్రాలు, శీతలీకరణ సదుపాయాలు అందుబాటులో లేకపోవడం ఈ సమస్యలకు పరిష్కారంగా అమూల్ సంస్థ ఆధ్వర్యంలో పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రైతుల నుంచి పాలను సేకరించే వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లోనే పాల సేకరణ కేంద్రాలు అందుబాటులోకి వస్తే పాడి రైతులు తమ ఉత్పత్తిని సమీప కేంద్రాలకు అందించి రైతులకు మార్కెట్‌తో అనుసంధానం ఏర్పడటంతో పాటు పాడి పరిశ్రమపై మరింత ఆసక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు, జిల్లా, సీనియర్ నాయకులు, జిల్లా వివిధ మోర్చాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొనారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.